ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -124 | పేజీలు - 8 | వెల - 03/- | శుక్రవారం 21 ఆగస్టు 2026

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

## మూడు భాషల విధానం అమలుపై సుప్రీం అభ్యంతరం

**సీబీఎస్ఈ 3 పునఃపరిశీలించాలని బోర్డుకు ఆదేశం**

**ఈ విధానం అమలుపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆదేశం**

**మూడు భాష విద్యార్థులపై అదనపు భారాన్ని మోపడమే అవుతుందన్న ధర్మాసనం**



**ఢిల్లీ ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్):** సీబీఎస్ఈ పాఠశాలల్లో మూడు భాషల విధానం అమలు తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జాతీయ విద్యా విధానం (బీజ్రూ 2020) అమలును తాము వ్యతిరేకించడం లేదని, అయితే దీనిని అమలు చేసే క్రమంలో విద్యార్థులపై అనవసర ఒత్తిడి పడకూడదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు ఈ విధానం యొక్క ఆచరణాత్మక అమలుపై మరోసారి సమగ్రంగా అధ్యయనం చేయాలని బోర్డును ఆదేశించింది.

మిగతా 2లో.



# వికసిత్ భారత్ నిర్మాణంలో
# దక్షిణాది కీలకం

**మహాబలిపురంలో జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం**

**ఆర్థిక శక్తిగా ఎదగాల్సిన అవసరం ఉంది**

**దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకరాం ముఖ్యం**

**సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సిఎం చంద్రబాబు**

**దక్షిణాది అభివృద్ధికి బ్లూప్రింట్ సమర్పించిన సీఎం చంద్రబాబు**

**కుప్పం మీదుగా బుల్లెట్ ట్రైన్, గోదావరి-కావేరి అనుసంధానంపై కీలక ప్రతిపాదనలు**



**చెన్నై,ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్):** వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది ప్రాంతం కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలనీ ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. కేంద్ర - రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని ఏపీ సీఎం సూచించారు. గురువారం తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి గురించి ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారమే లక్ష్యమని తెలిపారు.

మిగతా 2లో.

## మరోసారి యుద్ధం వస్తే మరింత విధ్వంసం..



**కొత్త ఆయుధాలు బయటికి తీస్తాం: ఇరాన్**

**కొత్త క్షిపణులు మరింత కచ్చితత్వంతో, ఎక్కువ శక్తితో ఉంటాయని వెల్లడి**

**అమెరికాతో రహస్య చర్చలు జరుపుతున్నామన్న వార్తలను ఖండన**

**ట్రంప్ వ్యాఖ్యలను 'భ్రమ'గా పేర్కొన్న ఐఆర్‌జీసీ ప్రతినిధి**

2లో.

## ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం..

**కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లపై స్టే ఎత్తివేతకు నిరాకరణ**

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయన్న తెలంగాణ హైకోర్టు**

**ఉచిత పథకాలకు నిధుల మళ్లింపు వల్ల అత్యవసర రంగాలపై ప్రభావం పడుతోందని వ్యాఖ్య**

**నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తే ఉచితాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని వ్యాఖ్య**




2లో.

## మోదీ, అమిత్ షాల రాజకీయ అధ్యాయం ముగిసింది : రాహుల్ గాంధీ

**మోదీ, అమిత్ షా రాజకీయ ఆధిపత్యం తగ్గిందని వ్యాఖ్య**

**కాంగ్రెస్, ఇండియా కూటమి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడి**



**ఢిల్లీ ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్):** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై మరోసారి విమర్శలు గుప్పించారు. ఎన్డీయేలో బీజేపీ రాజకీయ ఆధిపత్యం క్షీణించిందని... మోదీ, అమిత్ షా రాజకీయ ప్రయాణం ముగిసిపోయిందని

మిగతా 2లో.

## 5 బిల్లులు ఆమోదం

**శాసనమండలిలో 5 కీలక బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రి లోకేశ్**

**విద్యా, గ్రంథాలయ, నైపుణ్య రంగాలకు సంబంధించిన బిల్లులు**

**ఆమోదం పొందిన వాటిలో ప్రైవేటు స్కిల్ వర్సిటీల బిల్లు కూడా ఉంది**

**అమరావతి ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో పలు కీలక బిల్లులకు ఆమోదం లభించింది. రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ 5 ముఖ్యమైన బిల్లులను సభలో ప్రవేశపెట్టగా, మండలి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించింది. విద్యా, గ్రంథాలయ, నైపుణ్యాభివృద్ధి రంగాలలో సంస్కరణల లక్ష్యంగా ప్రభుత్వం ఈ బిల్లులను రూపొందించింది.నేడు జరిగిన శాసనమండలి సమావేశంలో మంత్రి లోకేశ్ ఈ బిల్లులను సభ ముందు ఉంచారు. మండలి ఆమోదించిన బిల్లులలో



మిగతా 2లో.

## గ్రూప్-1పై విచారణకు రెడీ..

**డీఎస్సీపై సీబీఐ విచారణకు మీరు సిద్ధమా? : చంద్రబాబుకు జగన్ సవాల్**

**లోకేశ్‌ను కాపాడేందుకే గ్రూప్-1పై తప్పుడు ప్రచారమన్న జగన్**



**అమరావతి ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ సీఎం చంద్రబాబుపై మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. డీఎస్సీ అక్రమాల నుంచి కుమారుడు నారా లోకేశ్‌ను కాపాడుకునేందుకే, ఏపీపీఎస్సీ గ్రూప్-1 పోస్టుల భర్తీపై చంద్రబాబు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని జగన్ ధ్వజమెత్తారు.

మిగతా 2లో.



## భూ భద్రత కోసమే భూ భారతి

**గతంలో బోగస్ పాస్ పుస్తకాలతో రైతుభరోసా స్వాహా**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**

**ఖమ్మం,ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్):** గత ప్రభుత్వ హయాంలో భూమి లేకపోయినా బోగస్ పాస్‌పుస్తకాలు సృష్టించి రైతుబంధు నిధులు స్వాహా చేసిన ఘటనలు ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా రైతులకు భద్రత కల్పించడమే లక్ష్యంగా భూ భారతి ద్వారా సర్వే చేపడుతున్నామని స్పష్టం చేశారు. రైతుల భూములకు భద్రత కల్పించడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే భూ భారతి సర్వే ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు.ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో

మిగతా 2లో.

## మత్స్యకారుల గల్లంతుపై చంద్రబాబు సీరియస్..

**ఎస్‌వోపీ అమలు చేయాలని ఆదేశం**

**కోనసీమ మత్స్యకారుల గల్లంతుపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష**

**ప్రమాదాలు జరగకుండా పటిష్ఠమైన ఎస్‌వోపీ అమలు చేయాలని అధికారులకు ఆదేశం**



2లో.

## స్థానిక పోరుకు జనసేన సై..

**ఆ వ్యూహం గత ఎన్నికలకే పరిమితమన్న పవన్ కల్యాణ్**

**స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని జనసేనకు పవన్ పిలుపు**

**విధివిధానాల రూపకల్పనకు ఎమ్మెల్యేలు, సీనియర్లతో ప్రత్యేక కమిటీ**

**అమరావతి ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సమాయత్తమవుతోంది. ఈ ఎన్నికలే లక్ష్యంగా పక్కా వ్యూహంతో ముందుకు సాగాలని పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించారు. సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించిన వ్యూహానికి భిన్నంగా, క్షేత్రస్థాయి బలాబలాలకు అనుగుణంగా ఈ ఎన్నికల్లో జనసేన



మిగతా 2లో.

# గ్రూప్-1పై విచారణకు రెడీ..

**మొదటిపేజీ తరువాయి**

గ్రూప్-1 వ్యవహారంపై సీబీఐ విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని, డీఎస్సీ కుంభకోణంపై సీబీఐ విచారణకు చంద్రబాబు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు.

డీఎస్సీపై దర్యాప్తు చేయాలని ఇప్పటికే కేంద్రాన్ని కోరినట్లు ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ గురించి వివరించారు. 2019 ఎన్నికలకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వమే హడావిడిగా ఈ నోటిఫికేషన్ ఇచ్చిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాకముందే మే 26న ప్రిలిమ్స్ పరీక్ష కూడా పూర్తయిందని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ప్రిలిమ్స్ ఫలితాలు ప్రకటించి, 2020 డిసెంబర్‌లో మెయిన్స్ నిర్వహించామని తెలిపారు. టీడీపీ హయాంలోనే జరిగిన పరీక్షలో ఎంపికైన వారికి ఇప్పుడు రాజకీయ రంగు పులమడం దారుణమని అన్నారు.కోవిడ్ కారణంగా మూల్యాంకనం ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో ఏపీపీఎస్సీ కమిషన్ డిజిటల్ మూల్యాంకనానికి నిర్ణయం తీసుకుందని, అయితే దీనిపై కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారని జగన్ వివరించారు. నోటిఫికేషన్‌లో పేర్కొననందున, హైకోర్టు ఆదేశాల మేరకు డిజిటల్ మూల్యాంకనాన్ని పూర్తిగా పక్కనపెట్టి, మాన్యువల్ పద్ధతిలోనే జవాబు పత్రాలను దిద్దామని స్పష్టం చేశారు. ఆ మార్కుల ఆధారంగానే 163 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చామని, ఈ ప్రక్రియ మొత్తం హైకోర్టు పర్యవేక్షణలోనే జరిగిందని తెలిపారు. ఇప్పుడు సంబంధం లేని డిజిటల్ మూల్యాంకనంపై ఆరోపణలు చేయడం కేవలం ఉద్యోగుల జీవితాలతో ఆడుకోవడమేనని విమర్శించారు.గ్రూప్-1 మూల్యాంకనం హాయ్‌ల్యాండ్‌లో జరిగిందంటూ చేస్తున్న ప్రచారాన్ని జగన్ తీవ్రంగా ఖండించారు. అక్కడ ఎలాంటి మూల్యాంకనం జరగలేదని, ఈ విషయాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నియమించిన సిట్ కూడా హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొందని గుర్తుచేశారు. తమపై బురద జల్లేందుకు దర్యాప్తు బృందాలను వాడుకోవడం చంద్రబాబుకు అలవాటేనని ఆరోపించారు. నాలుగేళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న వారిపై విషం కక్కుతూ, వారి భవిష్యత్తును నాశనం చేయాలని చూడటం సరికాదని జగన్ హితవు పలికారు. ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా చివరకు నిజమే గెలుస్తుందని ఆయన అన్నారు

# స్థానిక పోరుకు జనసేన సై..

**మొదటిపేజీ తరువాయి**

ప్రభావశీలమైన పోటీ ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన విధివిధానాల రూపకల్పనకు ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. గురువారం శాసనసభ ప్రాంగణంలోని తన కార్యాలయంలో జరిగిన జనసేన శాసనసభ పక్ష సమావేశంలో ఆయన పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో ఎన్నో దాడులు, బెదిరింపులు, ఒత్తిళ్లు ఎదురైనా ధైర్యంగా నిలబడిన జనసైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తిని ఎప్పటికీ విస్మరించబోమని అన్నారు. వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ఈ ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. "నామినేషన్ వేయలేని పరిస్థితులు సృష్టించినా, అప్పటి పాలకులను ఎదిరించి పోటీలో నిలిచిన మన శ్రేణుల త్యాగం విలువైనది. వారి స్ఫూర్తికి తగిన గౌరవం దక్కేలా ఈసారి జనసేన నిలబడుతుంది" అని ఆయన పేర్కొన్నారు.



సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, అప్పటి దాష్టీక పాలనను అంతం చేయాలనే లక్ష్యంతోనే జనసేన కేవలం 21 స్థానాలకు పరిమితమై పోటీ చేసిందని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఆ వ్యూహం కేవలం ఆ ఎన్నికలకే పరిమితమని, స్థానిక ఎన్నికల్లో ప్రాంతాలవారీగా రాజకీయ, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు ఉంటాయని వివరించారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకే పరిమితం కాకుండా, తమ పరిధిలోని ఇతర ప్రాంతాల్లో జనసేన బలాబలాలను అంచనా వేయాలని ఆదేశించారు. పోటీకి అనువైన స్థానాలను గుర్తించి, పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదిక ఇవ్వాలని సూచించారు.

రాబోయే ఎన్నికల కార్యాచరణ, విధివిధానాల రూపకల్పన కోసం 9 నుంచి 11 మంది సభ్యులతో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ ఈ కమిటీ పనిచేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో కొందరు ఎమ్మెల్యేలు, కొన్ని నియోజకవర్గాల్లో మిత్రపక్షాల నేతల వైఖరి వల్ల శ్రేణుల్లో అసహనం వ్యక్తమవుతోందని, కూటమి ధర్మానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని పవన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన పవన్ కల్యాణ్, ఈ అంశాలు తన దృష్టిలో ఉన్నాయని, పార్టీ శ్రేణుల మనోభావాలను తప్పక గౌరవిస్తామని హామీ ఇచ్చారు. వారికి రాజకీయంగా అండగా నిలుస్తూ, మెరుగైన అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

ఈ సుదీర్ఘ సమావేశంలో రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ నాగబాబు, రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్, ప్రభుత్వ విప్‌లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్ సహా పలువురు జనసేన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం..

**కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లపై స్టే ఎత్తివేతకు నిరాకరణ**

**ఢిల్లీ ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్):**

తెలంగాణలో అమలవుతున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల చట్టబద్ధత, ఉచిత పథకాలకు నిధుల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పథకాల నిధుల విడుదలపై ఉన్న మధ్యంతర స్టేను ఎత్తివేసేందుకు జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం నిరాకరించింది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై 'డేంజర్ బెల్స్' మోగుతున్నాయని హెచ్చరించిన ధర్మాసనం... పరిమితి లేకుండా ఉచిత పథకాలకు నిధులు మళ్లించడం వల్ల ఇతర అత్యవసర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని వ్యాఖ్యానించింది. నీటిపారుదల, ఇతర ప్రాజెక్టుల కోసం నిర్బంధంగా భూములిచ్చిన బాధితులకు ఏళ్లకు ఏళ్లు పరిహారం చెల్లించకుండా బకాయిలు పెట్టడంపై కోర్టు నిలదీసింది. భూబాధితులకు పరిహారం ఇవ్వడం ప్రభుత్వ చట్టబద్ధమైన బాధ్యత కాదా? అని ప్రశ్నించింది.

అలాగే, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమయానికి చెల్లించలేక పోవడంతో వారు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాధనాన్ని ఈ విధంగా వాడటానికి బదులు భూబాధితులకు సకాలంలో పరిహారం ఇచ్చి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే అసలు ఇటువంటి పథకాల అవసరమే ప్రజలకు ఉండదని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల బాట పట్టించి, ఆ ఆదాయంతో సంక్షేమం చేపట్టవచ్చని సూచిస్తూ, సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలకం

**మొదటిపేజీ తరువాయి**

దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందని ఆయన గుర్తు చేశారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. విభజన చట్టంలోని షెడ్యూల్ 9,10 సంస్థలు.. 12 ఏళ్లుగా ఇంకా విభజనకు నోచుకోలేదన్నారు. విభజన సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి ప్రాజెక్టులు కేంద్ర సహకారంతో సాకారం అవుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడును అనుసంధానించేలా బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను ఆయన ప్రతిపాదించారు. కుప్పం మీదుగా బు÷-లలెట్ ట్రైన్ నడపాలని పేర్కొన్నారు. రాజధాని అమరావతి - బెంగళూరు - చెన్నై నగరాలను అనుసంధానించేలా ఈ రవాణా వ్యవస్థ ఉండాలని స్పష్టం చేశారు. అలాగే దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టులు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను సీఎం చంద్రబాబు వివరించారు. దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానిం చాలనీ చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని తెలిపారు. విపత్తుల సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునేలా మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటును ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్ ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు.

రాజధాని

అమరావతికి చట్టబద్ధ రాజధాని హోదా సాధించామని ఈ సందర్భంగా ఏపీ సీఎం గుర్తు చేశారు. వనరుల లోటు, సెక్షన్ 56లోని అంశాలను పరిష్కరించాలనీ కేంద్రాన్ని ఆయన కోరారు. దుగ్గరాజుపట్నం పోర్టు, ర్గి÷నైరీ ప్రతిపాదనలకు వేగంగా అనుమతులు ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి స్పష్టం చేశారు.అలాగే కడప జేఎస్‌డబ్ల్యూ రైల్వే లింక్‌కు కూడా కేంద్ర అనుమతులు మంజూరు చేయాలన్నారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో 500 టీఎంసీలకుపైగా నీటిని మళ్లించే ప్రతిపాదన ఉందన్నారు. గోదావరి - కావేరి అనుసంధానంతో తమిళనాడు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారమని ఆయన అభిప్రాయపడ్డారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కలిసి నదీ జలాలపై సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గంగా - కావేరి నదుల అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక ఆవశ్యకతను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వివరించారు. నదుల అనుసంధానంపై కాలపరిమితితో కూడిన డీపీఆర్‌లు, అనుమతులు ఇవ్వాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు కోరారు.

సహకారం, సమన్వయంతోనే దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమని సీఎం చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని దక్షిణాది రాష్ట్రాల సీఎంలు కొనియాడారు. దక్షిణాది రాష్ట్రాల సమగ్రాభివృద్ధి గురించి ఎంతో విజన్‌తో సీఎం చంద్రబాబు మాట్లాడారని ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు ముఖ్యమంత్రులు పేర్కొన్నారు. సీనియర్ నాయకుడిగా విశాల దృక్పథంతో అన్ని రాష్ట్రాల అభివృద్ధి గురించి మాట్లాడారంటూ సీఎం చంద్రబాబును కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ప్రశంసించారు.

# మత్స్యకారుల గల్లంతుపై చంద్రబాబు సీరియస్..

**ఎస్‌వోపీ అమలు చేయాలని ఆదేశం**

**అమరావతి ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్):**

బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఏడుగురు మత్స్యకారుల గల్లంతు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాదని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్టమైన ప్రామాణిక కార్యాచరణ విధానం మలు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై గురువారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, గాలింపు చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.సమీక్ష సందర్భంగా చంద్రబాబు పలు కీలక ప్రశ్నలను అధికారులపై సంధించారు. "బోటులో ట్రాన్స్‌పాండర్ ఏమైంది? ఆ బోటు ఒక్కటే ఎందుకు వేటకు వెళ్లింది? గల్లంతైనట్లు సమాచారం ఎప్పుడు అందింది? గాలింపు చర్యలు ఎప్పుడు ప్రారంభించారు?" అంటూ లోతుగా ఆరా తీశారు. కేవలం ఘటన జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందస్తు నివారణ చర్యలపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలను మరింత విస్తృతం చేయాలని సూచించారు.ఈ నెల 3వ తేదీన అల్లవరం మండలం ఓడలరేవు తీరం నుంచి ఏడుగురు మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. సాధారణంగా 10 రోజుల్లో తిరిగి రావాల్సి ఉండగా, గడువు దాటినా వారి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గల్లంతైన బోటులో 15 రోజులకు సరిపడా రేషన్, వెయ్యి లీటర్ల డీజిల్ ఉన్నాయని, ప్రాథమిక సమాచారం ప్రకారం బోటు విశాఖ లేదా పారాదీప్ వైపు వెళ్లి ఉండవచ్చని జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్ తెలిపారు.ప్రస్తుతం కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. సమీక్ష సందర్భంగా చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక లోపాలు, భద్రతా వైఫల్యాలపై దృష్టి సారించాలని సూచించారు.గల్లంతైన మత్స్యకారుల వివరాలు: కోపనాతి రామకృష్ణ (కొమరగిరిపట్నం), సంఘాని తాతారావు (బలుసుతిప్ప), పాలెపు శాంతారావు (ఓడలరేవు), ఏసుదాస్ (అడగట్లపాలెం), కొల్లాటి శ్రీనివాస్ (ఓడలరేవు), కాటాడి సతీశ్ (పశువులంక), కర్రి రాముడు (నక్క రామేశ్వరం). వీరి ఆచూకీ కోసం అధికారులు అన్నివిధాలా ప్రయత్నిస్తున్నారు.

# 'మార్గదర్శి'కి సుప్రీంలో భారీ ఊరట.. ఉండవల్లి పిటిషన్ కొట్టివేత

**ఢిల్లీ ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్):**

ఈనాడు గ్రూప్ నకు చెందిన మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో ఆ సంస్థకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఈ కేసులో ప్రజా ప్రయోజనం ఏమీ కనిపించడం లేదని, ఇది వ్యక్తిగత వివాదంలా ఉందని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.



గురువారం ఈ పిటిషన్‌పై తుది విచారణ సందర్భంగా మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, నాగముత్తు వాదనలు వినిపించారు. డిపాజిటర్లకు ఇప్పటివరకు రూ.2,500 కోట్లు చెల్లించామని, క్లెయిమ్ చేయని రూ.5.23 కోట్లను ఎస్క్రో అకౌంట్‌లో ఉంచామని వారు కోర్టుకు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే పబ్లిక్ నోటీసు జారీ చేసి, సెటిల్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేశామని వివరించారు.

ఈ సమయంలో ధర్మాసనం పిటిషనర్ ఉండవల్లి అరుణ్ కుమార్‌ను ఉద్దేశించి పలు కీలక ప్రశ్నలు సంధించింది. "ఈ పిటిషన్ వేసి, పోరాడటానికి మీరెవరు?" అని ప్రశ్నించింది. "ఈ కేసు వివరాలు పరిశీలిస్తే ఇది పూర్తిగా వ్యక్తిగత వివాదంలా కనిపిస్తోంది. ఇందులో ఎలాంటి ప్రజా ప్రయోజనం మాకు కనిపించడం లేదు. మీరు వాదించే కొద్దీ మీపైనే అనుమానాలు పెరుగుతున్నాయి" అని జస్టిస్ సుందరేశ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ధర్మాసనం ఉండవల్లి పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

# మూడు భాషల విధానం అమలుపై సుప్రీం అభ్యంతరం

**మొదటిపేజీ తరువాయి**

ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 10వ తరగతి వచ్చేసరికి మూడో భాషలో కూడా తప్పనిసరిగా బోర్డు పరీక్ష రాయాల్సి రావడం వారిపై అదనపు భారాన్ని మోపడమే అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ప్రస్తుత 6వ తరగతి విద్యార్థులకు ఈ మూడో భాష బోర్డు పరీక్ష నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. అంతేకాకుండా, ఈ విధానాన్ని అసలు 6వ తరగతి నుంచి ప్రారంభించాలా లేక ప్రాథమిక స్థాయిలోనే 3 లేదా 4వ తరగతి నుంచే అమలు చేయాలా అనే విషయాన్ని కూడా పునరాలోచించాలని స్పష్టం చేసింది.

పాఠశాలల్లో సరిపడా అర్హత కలిగిన ఉపాధ్యాయుల లభ్యత, పాఠ్యపుస్తకాలు, అవసరమైన మౌలిక వసతుల కల్పనపై స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీని ధర్మాసనం ఆదేశించింది. విద్యార్థులు ఇన్నాళ్లుగా చదువుతున్న విదేశీ భాషల కాంబినేషన్ దెబ్బతినకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపింది.

## మోదీ, అమిత్ షాల రాజకీయ అధ్యాయం ముగిసింది

**మొదటిపేజీ తరువాయి**

అన్నారు. కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

కేంద్రంలో బీజేపీకి స్వతంత్రంగా మెజారిటీ లేకపోవడం వల్ల ఆ పార్టీ రాజకీయ శక్తి, పట్టు పూర్తిగా తగ్గిపోయాయని ఆయన విమర్శించారు. గతంలో చూపిన రాజకీయ ఆధిపత్యాన్ని మోదీ, అమిత్ షా జోడీ ఇప్పుడు కోల్పోయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ, 'ఇండియా' కూటమి మరింత వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలపై పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని, రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# 5 బిల్లులు ఆమోదం

**మొదటిపేజీ తరువాయి**

పబ్లిక్ గ్రంథాలయాల సవరణ బిల్లు-2026, ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సవరణ బిల్లు ఉన్నాయి.వీటితో పాటు ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాసంస్థల (ఉపాధ్యాయుల కేడర్ లో రిజర్వేషన్) సవరణ బిల్లులను కూడా సభ ఆమోదించింది. రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన ఏపీ ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ బిల్లుకు కూడా మండలి ఆమోదముద్ర వేసింది. ఈ బిల్లులకు సభ్యులందరూ మద్దతు తెలపడంతో ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు ప్రకటించారు.

# భూ భద్రత కోసమే భూ భారతి

**మొదటిపేజీ తరువాయి**

భూ రీ-సర్వేపై నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని మొత్తం ఏడు గ్రామాల్లో భూ భారతి కార్యక్రమం కింద భూ సర్వే ప్రారంభమైనట్లు మంత్రి తెలిపారు. గతొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 70 గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామని, ప్రతి ఆరు నెలలకు 70 గ్రామాల చొప్పున సర్వే కొనసాగించి ఏడాదిన్నర కాలంలో పక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. సర్వే పక్రియలో రెవెన్యూ అధికారులు నిరంతరం కష్టపడుతున్నారని.. పూర్తయిన భూ వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. భూ భారతి చట్టాన్ని రైతులకు ఉపయోగపడేలా రూపొందించామని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ధరణి వ్యవస్థలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నేతలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని, వాటికి స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. రంగులు వేరైనా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటేనంటూ రెండు పార్టీల మధ్య ఉన్న రాజకీయ బంధాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

# మరోసారి యుద్ధం వస్తే మరింత విధ్వంసం.

**ఢిల్లీ ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్):**

తమ దేశంపై మరోసారి బలవంతంగా యుద్ధాన్ని రుద్దితే, ఈసారి మరింత విధ్వంసకరమైన, అత్యాధునిక ఆయుధాలను ప్రయోగిస్తామని ఇరాన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. గతంలో జరిగిన యుద్ధాల తర్వాత తమ సైనిక సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకున్నామని, ఇప్పుడు మొదలయ్యే ఎలాంటి ఘర్షణలోనైనా తమ ఆయుధాలు భిన్నంగా ఉంటాయని స్పష్టం చేసింది.

ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అధికార ప్రతినిధి హుస్సేన్ మొహెబ్బి గురువారం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "గత ఏడాది జూన్, ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా, ఇజ్రాయెల్ మాపై రుద్దిన యుద్ధాల తర్వాత మా సైనిక శక్తిని విస్తరించుకున్నాం. ఒకవేళ కొత్తగా యుద్ధం ప్రారంభమైతే, మా క్షిపణుల వార్‌హెడ్‌లు, వాటి కచ్చితత్వం, పరిధి విషయంలో భారీ మార్పులు ఉంటాయి. గతంలో వాడిన వాటి కంటే కొత్త క్షిపణుల విధ్వంసక శక్తి చాలా ఎక్కువగా ఉంటుంది" అని ఆయన వివరించారు. ఆయుధాల ఉత్పత్తిని ఇరాన్ ఎన్నడూ ఆపలేదని ఆయన నొక్కిచెప్పారు.మరోవైపు, అమెరికాతో రహస్య చర్చలు జరుగుతున్నాయంటూ ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను మొహెబ్బి ఖండించారు. ఐఆర్‌జీసీ అధికారులు అమెరికన్లతో ఎలాంటి చర్చలు జరపడం లేదని, ట్రంప్ వ్యాఖ్యలు కేవలం 'భ్రమ' అని కొట్టిపారేశారు. వాషింగ్టన్ తన వాగ్దానాలను నిలబెట్టుకోకపోవడం వల్లే ప్రస్తుతం ఆ దేశంతో దౌత్యపరమైన చర్చలు కూడా జరగడం లేదని ఆయన తెలిపారు.ఇదే విషయంపై ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ కూడా స్పందించారు. ఇరాకీ కుర్దిస్థాన్ అధికారుల ద్వారా అమెరికాతో రహస్యంగా సమావేశమయ్యారంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని అన్నారు. ఇరాన్ నిర్ణయాధికార వ్యవస్థలో విభేదాలు సృష్టించేందుకు పన్నుతున్న మీడియా ఎత్తుగడలు, మానసిక యుద్ధంలో భాగమే ఈ ప్రచారమని ఆయన ఆరోపించారు.గతంలో ఇరుపక్షాల మధ్య ఏప్రిల్ 8న కాల్పుల విరమణ ఒప్పందం, జూన్ 18న యుద్ధాన్ని ముగించేందుకు అవగాహన ఒప్పందం కుదిరినప్పటికీ, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మాత్రం తరచుగా కొనసాగుతూనే ఉన్నాయి.

# మైనర్ డ్రైవింగ్‌పై పోలీసుల ఉక్కుపాదం

**20 ద్విచక్ర వాహనాలు గుర్తింపు.. జరిమానాలు**

**విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్**





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 20)**మైనర్లు వాహనాలు నడపకుండా కట్టడి చేసేందుకు కర్నూలు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ రోడ్డు నుంచి మౌర్య ఇన్ మధ్యలోని చైతన్య కళాశాల సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులు నడుపుతున్న 20 ద్విచక్ర వాహనాలను పోలీసులు గుర్తించారు. నిబంధనల ప్రకారం ఆయా వాహనాలకు జరిమానాలు విధించారు. వీటిలో కొన్ని అధిక సీసీ సామర్థ్యం కలిగిన వాహనాలు కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మైనర్ విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రత, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించి, పిల్లల భద్రత విషయంలో మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని, రహదారి భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కర్నూలు ట్రాఫిక్ పోలీసులు సూచించారు. మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టేందుకు ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# కర్నూల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

**ఆళ్లగడ్డలో న్యాయవాదుల నిరసన ప్రదర్శన**




**ఆళ్లగడ్డ ఆగస్టు 20 రిపబ్లిక్ న్యూస్**

ఆళ్లగడ్డ పట్టణం లోని కోర్ట్ నందు న్యాయవాదులుఈ రోజు ఉదయం కోర్ట్ విధులను బహిష్కరించారు కర్నూలు నగరంలో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆళ్లగడ్డ లో గురువారం న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరామిరెడ్డి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరామిరెడ్డి మాట్లాడుతూ.. శ్రీ బాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులో గత ప్రభుత్వం హైకోర్టు బెంచి ఏర్పాటు చేస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా హైకోర్టు బెంచి ఏర్పాటుపై నిర్లక్ష్యం వహిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయకపోతే న్యాయవాదుల సత్తా చూపిస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు బార అసోసియేషన్ సెక్రటరీ గోపాల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు బి నీలకంఠేశ్వరం, పి సూర్యనారాయణ రెడ్డి , జనార్ధన్, వెంకటరమణ, మురళీధర్ బాబు, తిమ్మయ్య, మాదం రవి, జాయింట్ సెక్రటరీ షాహిన, ట్రెజరర్ శ్రావణి, దాదా పీర్ , జాయింట్ సెక్రటరీ వెంకటయ్య, బాబా ఫక్రుద్దీన్, గోడిగనూరు శేఖర్, తొమ్మండ్రు వినోద్ కుమార్, డిసి విజయ్, చాణక్య శ్రీనివాసులు , ఎన్ మురళీమోహన్, హరి తదితరులు పాల్గొన్నారు.

# అహోబిలం రిజర్వ్ ఫారెస్టులో తప్పిపోయిన భక్తులు

**కాపాడిన రూరల్ పోలీసులు, ఫారెస్ట్ సిబ్బంది**



**ఆళ్లగడ్డ ఆగస్టు 20 రిపబ్లిక్ న్యూస్**

ఆళ్లగడ్డ మండలం అహోబిలం లో వెలసిన నరసింహ స్వామిదర్శనానికి వచ్చిన భక్తులలో 5గురు దారి తప్పిపోయారు పావన నరసింహస్వామి ఆలయం నుండి ఎగువ అహోబిలం వైపు వస్తున్న ఒక పురుషుడు, ఐదుగురు మహిళలు అహోబిలం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో తప్పిపోయినట్లు సమాచారం వచ్చిందని. బంధువుల ద్వారా సమాచారం అందిన వెంటనే అహోబిలం ఫారెస్ట్ సిబ్బంది, అహోబిలం సిబ్బంది మరియు రూరల్ పోలీసులు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టామని . గాలింపు చర్యల్లో తప్పిపోయిన వారిని గుర్తించి, సురక్షితంగా రక్షించడం జరిగిందని అనంతరం వారిని వారి కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించడం జరిగిందని ఆళ్లగడ్డ రూరల్ S I తెలిపారు.

# ఆళ్లగడ్డ గణేష్ ఉత్సవ కేంద్ర సమితి సమావేశం

**24న మండపాల నిర్వాహకులతో భేటీ**

**ఆళ్లగడ్డ ఆగస్టు 20 రిపబ్లిక్ న్యూస్**



ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీ ఆవుల పుల్లారెడ్డి సేవాసమితి భవనంలో శ్రావణమాసం బుధవారం సాయంత్రం ఆళ్లగడ్డ గణేష్ ఉత్సవ కేంద్ర సమితి కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో రాబోయే వినాయక చవితి వేడుకల నిర్వహణ, ఏర్పాట్లపై కార్యవర్గ సభ్యులు సమగ్రంగా చర్చించారు.

వినాయక చవితి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పట్టణంలోని గణేష్ మండపాల నిర్వాహకులతో ఈ నెల 24వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశానికి సమితి అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షత వహించగా, గౌరవ అధ్యక్షులు టి.ఎం.సి. వేణుగోపాల్, న్యాయ సలహాదారులు నీలకంఠేశ్వరం, మురళీధర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, గ్యాస్ పుల్లయ్య, ప్రజ్ఞా నర్సింహారెడ్డి, మల్లీశ్వరరెడ్డి, రామాచారి, కృష్ణమాచారిలతో పాటు సభ్యులు దీప్తీ చంద్రసేన, ముని రామకృష్ణ, సీనియర్ న్యాయవాది తిరుపాల్ రెడ్డి, మురళి, రవి, శంకర్, నరసింహారావు, నాగరాజు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

**ఐటీ విప్లవానికి ఆద్యుడు.. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత ఆయనదే**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 20)**

భారతదేశంలో సమాచార సాంకేతిక విప్లవానికి మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ ఆద్యుడని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు ఎం. సుధాకర్ బాబు కొనియాడారు. రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ బాబు మాట్లాడుతూ.. ప్రపంచం కంప్యూటర్ యుగంలోకి అడుగుపెడుతున్న సమయంలో భారత్‌లోనూ సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ బాటలు వేశారని అన్నారు. కంప్యూటర్, టెలికమ్యూనికేషన్స్, సమాచార సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన తీసుకున్న నిర్ణయాల ఫలితాలను నేడు దేశం అనుభవిస్తోందన్నారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించిన ఘనత కూడా రాజీవ్ గాంధీకే దక్కుతుందని సుధాకర్ బాబు పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, కంప్యూటర్ రంగాలపై దృష్టి సారించి దేశాన్ని సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. రక్షణ, విమానయాన, వాణిజ్య రంగాల అభివృద్ధికి ఆయన తీసుకున్న చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాయని అన్నారు. విద్యారంగంలోనూ రాజీవ్ గాంధీ అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని సుధాకర్ బాబు తెలిపారు. 1986లో నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడంతో పాటు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు నవోదయ పాఠశాలలను ఏర్పాటు చేశారని చెప్పారు. బ్లాక్‌బోర్డు కార్యక్రమం, ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీ వంటి కార్యక్రమాలు విద్యా రంగంలో మార్పులకు దోహదపడ్డాయని వివరించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం సి.క్యాంప్ సెంటర్‌లోని రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఎన్.సి. బజారన్న, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు బి. బతుకన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు శ్రీనిధ్ రాయల్, విజయ్, కర్నూలు, నంద్యాల జిల్లాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏ. ప్రదీప్ రాయల్, జి. శ్రీనివాస్ యాదవ్, నంద్యాల జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ కర్నూలు నియోజకవర్గ అధ్యక్షులు డాక్టర్ అలీ ఖాన్, ఎస్సీ సెల్ మాజీ జిల్లా చైర్మన్ ఈ. లాజరస్, బి. సుబ్రహ్మణ్యం, ఐఎన్‌టీయూసీ సిటీ అధ్యక్షులు ఆర్. ప్రతాప్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

# చెత్త కుప్పలు లేని కర్నూలును నిర్మిద్దాం!

**36 జీవీపీలకు సరికొత్త రూపం..**

**50 ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిఘా**

**బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు**

**: కమిషనర్ చల్లా ఓబులేసు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 20)**

చెత్త కుప్పలు లేని పరిశుభ్రమైన నగరంగా కర్నూలును తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపునిచ్చారు. నగరంలోని గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను (జీవీపీ) నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

విద్యానగర్, గాంధీనగర్, రోజా స్ట్రీట్, వెంకటరమణ కాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి వాటిని సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు.

నగర పరిధిలో మొత్తం 135 జీవీపీలను గుర్తించగా.. ఇప్పటికే 36 జీవీపీలను శుభ్రపరిచి గ్రీనరీ, మొక్కలు, బెంచీలను ఏర్పాటు చేసి సరికొత్త రూపాన్ని కల్పించినట్లు కమిషనర్ తెలిపారు. ఆయా ప్రాంతాలను ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంగా మార్చడంతో పాటు, తిరిగి చెత్త కుప్పలుగా మారకుండా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

**50 జీవీపీల వద్ద సీసీ కెమెరాలు**

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై నిఘా ఉంచేందుకు జీవీపీల వద్ద దశలవారీగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఇప్పటికే 50 జీవీపీల వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించి చెత్త వేసే వారిపై జరిమానాలు విధిస్తున్నామని తెలిపారు.

ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఇంటింటికీ వచ్చే మున్సిపల్ పారిశుద్ధ్య వాహనాలకు చెత్తను అందించాలని సూచించారు. జీవీపీలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు.

**ఇంటింటికీ చెత్త సేకరణ**

కర్నూలు నగరంలో సుమారు 1,55,914 గృహాలు ఉన్నాయని, ఇంటింటి చెత్త సేకరణ కోసం 1,194 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని కమిషనర్ తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించేందుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు అందుబాటులో ఉన్నారని చెప్పారు. పారిశుద్ధ్య పనుల్లో ఎక్కడైనా లోపాలు కనిపిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, సానిటరీ సూపర్వైజర్ రమేష్ బాబు, ఇన్‌స్పెక్టర్లు మునిస్వామి, అనిల్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# రచ్చకెక్కిన టిడిపి

**అవినీతి అక్రమాలకు కేరాఫ్ ఎమ్మెల్యే :మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి**

**టీడీపీలో అంతర్గత కలహం -ఎమ్మెల్యే దగ్గుపాటిపై ప్రభాకర్‌చౌదరి సంచలన ఆరోపణలు**

**అనంతపురం రామ్‌నగర్, ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్):**

అధికార టీడీపీలో అంతర్గత విభేదాలు అనంతపురం అర్బన్‌లో రచ్చకెక్కాయి. ఇంతకాలం తెరవెనుక సాగిన విభేదాలు.. తాజాగా మీడియా వేదికగా బహిర్గతమయ్యాయి. సొంత పార్టీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌పై మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలకు ఎమ్మెల్యేనే కర్త, కర్మ, క్రియ అంటూ సంచలన ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే భూకబ్జాలు, దోపిడీలతో పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటోందని మండిపడ్డారు.



**అధిష్ఠానానికి చెప్పుకునే అవకాశం లేదా...**

తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభాకర్‌చౌదరి మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా తన వాదన వినిపించే అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తల సమస్యలను పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారిపోయాయని, వైసీపీ ప్రభుత్వ హయాంలో కూడా తమకు ఇన్ని అవమానాలు ఎదురుకాలేదని వ్యాఖ్యానించడం ద్వారా సొంత పార్టీ నాయకత్వంపై తన అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేశారు.

**నా అనుచరులే లక్ష్యం ఆపై అక్రమ కేసులు**

తన అనుచరుడు శ్రీనివాస్‌చౌదరిని లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ప్రభాకర్‌చౌదరి ఆరోపించారు. రాజకీయంగా విభేదాలు ఉంటే వాటిని రాజకీయంగానే ఎదుర్కోవాలని.. కార్యకర్తలు, అనుచరులపై కేసులు పెట్టి భయపెట్టే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికే రక్షణ లేకపోతే క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు.

**ప్రభుత్వ కార్యాలయాల్లో బామ్మర్దుల జోక్యం ఎందుకు**

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ బామ్మర్దులు ప్రభుత్వ కార్యాలయాల్లోకి వెళ్లి జోక్యం చేసుకుంటున్నారని ప్రభాకర్‌చౌదరి ఆరోపించారు. అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని విమర్శించారు. ప్రజల పనులు జరగాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ జోక్యానికి తావివ్వడం సరికాదన్నారు. ఈ వ్యవహారంపై పార్టీ నాయకత్వం దృష్టి సారించాలని కోరారు.

**బాధితులు ముందుగా ఎమ్మెల్యేను కలిసి రావాలి: సీఐ**

ఇక పోలీసుల వ్యవహారశైలిపైనా ప్రభాకర్‌చౌదరి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గంలో అన్యాయానికి గురైన బాధితులు పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడానికి ప్రయత్నిస్తే.. ముందుగా ఎమ్మెల్యేను కలిసి రావాలని సీఐ చెబుతున్నారని ఆరోపించారు. అలా చేయకపోతే బాధితులపైనే తిరిగి కేసులు పెడతామని బెదిరిస్తున్నారని అన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే భయపెట్టే పరిస్థితి రావడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

**రచ్చ “టీడీపీ వర్సెస్ టీడీపీ“ చర్చ**

అనంతపురం అర్బన్ టీడీపీలో నెలకొన్న విభేదాలు ఇప్పుడు బహిరంగ రాజకీయ పోరుగా మారుతున్నాయా అన్న చర్చ మొదలైంది. ఒకే పార్టీలో ఉన్న ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యే వరుస ఆరోపణలు చేయడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. ఇప్పటికే అంతర్గతంగా ఉన్న అసంతృప్తి.. తాజా మీడియా సమావేశంతో మరింత తీవ్రరూపం దాల్చినట్లు పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది.

**సొంత పార్టీ నేతలు బహిరంగంగా ఆరోపణలు**

అధికారంలో ఉన్న సమయంలోనే సొంత పార్టీ నేతలు బహిరంగంగా ఆరోపణలు చేసుకోవడం టీడీపీ అధిష్ఠానానికి ఇబ్బందికర పరిణామంగా మారింది. అర్బన్ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో నేతల మధ్య విభేదాలు బయటపడటం కార్యకర్తల్లోనూ చర్చకు దారితీస్తోంది. అర్బన్ టీడీపీలో అంతర్గత పోరు బహిరంగంగా ఆరోపణలు చేసుకోవడం జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.

# అట్టహాసంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

## తేజ రాయల్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం -ముఖ్య అతిథులుగా పాల్గొన్న టి.సి.వరుణ్, భవానీరవికుమార్





**అనంతపురం ప్రతినిధి, ఆగస్టు 20,(రిపబ్లిక్ న్యూస్):**
పద్మవిభూషణ్ మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి జన్మదిన వేడుకలకు అనంతపురంలో అట్టహాసంగా శ్రీకారం చుట్టారు. ఆగస్టు 22న చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలోని టవర్‌క్లాక్ సమీపంలో జనసేన నాయకుడు తేజ రాయల్ ఆధ్వర్యంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల జనసేన పార్టీ అధ్యక్షుడు, అహుడ చైర్మన్ టి.సి.వరుణ్, చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడు భవాని రవికుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం తేజ రాయల్ స్వయంగా రక్తదానం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**రక్తదానం ఒక ప్రాణదానంతో సమానం**

ఈ సందర్భంగా భవాని రవికుమార్, తేజ రాయల్ మాట్లాడుతూ చిరంజీవి ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారని తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఆయన అందించిన సహాయ సహకారాలు చిరస్మరణీయమన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసర సమయంలో రక్తం అందించాలనే ఉన్నత ఆశయంతో చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. 1998లో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసిన నాటి నుంచి రక్తదాన సేవా స్ఫూర్తిని అభిమానులు కొనసాగిస్తున్నారని తెలిపారు.
చిరంజీవి జన్మదినం సందర్భంగా అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. రక్తదానం ఒక ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్నవారికి రక్తాన్ని అందించడం ద్వారా ఎంతోమందికి అండగా నిలవచ్చన్నారు.

**చిరంజీవి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలి**

చిరంజీవి స్ఫూర్తితో నిర్వహిస్తున్న రక్తదాన కార్యక్రమాల్లో యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిరంజీవి, ఆయన కుటుంబ సభ్యులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, చిరంజీవి కుటుంబానికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జనసేన జిల్లా నాయకుడు గల్లా హర్ష, చిరంజీవి సీనియర్ అభిమానులు చలపతి, చంద్రమౌళి, శామీర్, కాయగూరల వెంకటేష్, ఆరిఫ్, మెగా యూత్ జిల్లా అధ్యక్షుడు దూదాకుల, కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ ఇమామ్ హుస్సేన్, మెగా యూత్ ఫోర్స్ అనంతపురం నగర అధ్యక్షుడు వరుణ్, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శులు కాలేషా, రోళ్ల భాస్కర్, వెంకట నారాయణ, మాధవ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. శిబిరానికి అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

# తాగునీటి కష్టాలకు తెర

## రూ.250 కోట్లతో పైపులైన్ పనులు



**గుత్తి ఆగస్టు 20 రిపబ్లిక్ న్యూస్ ):**
పట్టణ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.250 కోట్లతో పైపులైన్ పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలిపారు. ఎన్నికల సమయంలో గుత్తి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి పట్టణంలోని అన్ని ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.
గుత్తి పట్టణంలో తాగునీటి సమస్య చాలాకాలంగా ఉంది. ముఖ్యంగా వేసవిలో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారం కోసం భారీ తాగునీటి పైపులైన్ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పనులు పూర్తయితే పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగనున్నాయి.
**హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు** :తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.250 కోట్లతో పనులు చేపట్టడంపై గుత్తి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన తనయుడు, గుత్తిపామిడి ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ చొరవను కూడా అభినందించారు. పనులను త్వరగా పూర్తిచేసి ఇంటింటికీ తాగునీరు అందించాలని కోరారు.

# రమాదేవికి ఎమ్మెల్సీ.. వడియా రాజుల సంఘం సంబరాలు

## వడియారా సమాజానికి రాజకీయ ప్రాధాన్యం పెరిగింది: నాయకులు



**గుత్తి ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్):**
గవర్నర్ కోటాలో దళవాయి రమాదేవి ఎమ్మెల్సీగా నియమితులు కావడంతో గుత్తి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో సూర్యవంశ వడియారాజుల సంఘం, ఆధ్వర్యంలో గురువారం వడియారా నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వడియారా సామాజికవర్గానికి చెందిన దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి దక్కడం ఆ వర్గానికి గర్వకారణమన్నారు. రాజకీయంగా వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడంలో ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. వడ్డెర సమాజ సమస్యలను శాసనమండలి వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రమాదేవికి మంచి అవకాశం లభించిందని పేర్కొన్నారు. వడ్డెర వర్గానికి ఎమ్మెల్సీ పదవి దక్కడంతో ఆ సామాజికవర్గంలో నూతన ఉత్సాహం నెలకొందన్నారు. రమాదేవి తనకు లభించిన పదవిని ప్రజా సేవకు వినియోగించాలని, ముఖ్యంగా వడ్డెర కుటుంబాల విద్య, ఉపాధి, సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. వడ్డెర సమాజానికి గుర్తింపు కల్పించిన ఎన్డీఏ ప్రభుత్వ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

**రాజకీయ ప్రాధాన్యం పెరిగింది**

సూర్యవంశ వడియారాజుల సంఘం అధ్యక్షుడు పీట్ల చిరంజీవి మాట్లాడుతూ.. రమాదేవికి ఎమ్మెల్సీ పదవి దక్కడంతో వడ్డెర సమాజానికి రాజకీయంగా మరింత ప్రాధాన్యం లభించిందన్నారు. ఈ అవకాశం వడ్డెర యువతలో స్ఫూర్తిని నింపుతుందని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి రమాదేవి తనవంతు కృషి చేయాలని కోరారు. ఓసీసీఐ రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ మాట్లాడుతూ.. వడ్డెర మహిళకు ఎమ్మెల్సీ పదవి దక్కడం సంతోషకరమన్నారు. మహిళల సమస్యలతో పాటు వడ్డెర సమాజ సమస్యలను రమాదేవి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఓసీసీఐ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, గుత్తి టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి బత్తల మారుతిప్రసాద్ మాట్లాడుతూ.. రమాదేవి నియామకం వడ్డెర సమాజానికి దక్కిన గౌరవమన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ నాయకత్వానికి వడ్డెర సంఘాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఓసీసీఐ లైఫ్ మెంబర్ వరదరాజులు, సంఘం ఉపాధ్యక్షులు తొండపాడు రామాంజి, చంద్ర, ధర్మపురం మాజీ సర్పంచ్, రైల్వే రిటైర్డ్ ఉద్యోగి రామచంద్ర, సంఘం గౌరవాధ్యక్షుడు ఎంఎల్‌ఏ వెంకటరాముడు తదితరులు మాట్లాడుతూ.. రమాదేవి ఎమ్మెల్సీగా ప్రజల గొంతుకగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోదొడ్డి సుధాకర్, వెంకటేష్, ఎంగిలిబండ వెంకటరాముడు, వీరాంజి, మునేష్, చెర్లోపల్లె రమేష్, నాగరాజు, రాజు, మామిడొడ్డి రమేష్, సురేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొని ఎన్డీఏ నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రమాదేవికి ఎమ్మెల్సీ పదవి దక్కడంపై మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు.

# ఇంటింటికి సంక్షేమ ఫలాలు

## చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

## 8వ వార్డు యూనిట్ ఇంచార్జ్ కదిరికోట షాలేం





**ఎమ్మిగనూరు, ఆగష్టు, 20,(ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ 8వ వార్డు యూనిటీ ఇన్‌చార్జ్ కదిరికోట షాలేము రాజు ఆధ్వర్యంలో 143, 136 బూత్‌ల పరిధిలో ఇంటింటా కార్యక్రమం ముమ్మరంగా కొనసాగింది. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల సమస్యలను స్వీకరించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంబీ మహేష్, క్లస్టర్-10 దాదాసాహెబ్, వార్డు అధ్యక్షుడు సురేంద్ర, బూత్ కన్వీనర్లు ఎం. ప్రవీణ్, హనుమంతు, టీడీపీ కార్యకర్తలు ఎం. కిరణ, ఎంఎ షేక్, సీమోన్ తదితరులు పాల్గొన్నారు.

# డీఈఓ కార్యాలయం ఎదుట సెప్టెంబర్ 1న ఫ్యాప్టో ధర్నా

## ఈ నెల 31లోగా డీసీఈబీ సెక్రటరీ నియామకం చేపట్టాలి

## -హామీ అమలు చేయకపోతే ఆందోళన తప్పదని హెచ్చరిక




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 20)**
కర్నూలు జిల్లాలో డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) సెక్రటరీ నియామకాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో నాయకులు జిల్లా విద్యాశాఖాధికారికి ధర్నా నోటీస్ అందజేశారు.
డీసీఈబీ సెక్రటరీ నియామకం కోసం ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో నోటిఫికేషన్ జారీ చేసి, దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. అనవాయితీ ప్రకారం దరఖాస్తు చేసిన వారిలో సీనియర్ ప్రధానోపాధ్యాయుడిని సెక్రటరీగా నియమించాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు నియామక ప్రక్రియ పూర్తికాలేదని ఫ్యాప్టో నాయకులు పేర్కొన్నారు.
ఈ అంశంపై గతంలో జిల్లా ఫ్యాప్టో నాయకత్వానికి జిల్లా విద్యాధికారి హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు నియామకం జరగకపోవడంతో నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఫ్యాప్టో కర్నూలు జిల్లా చైర్మన్, ఆప్టా జిల్లా అధ్యక్షుడు ఎం. మధుసూదన్ రెడ్డి, ఫ్యాప్టో కర్నూలు సెక్రటరీ జనరల్ భాస్కర్ (బీటీఏ) నాయకత్వంలో జిల్లా విద్యాధికారికి ధర్నా నోటీస్ అందజేశారు. ఈ నెల 31వ తేదీలోగా డీసీఈబీ సెక్రటరీ నియామకం చేపట్టకపోతే సెప్టెంబర్ 1న కర్నూలు జిల్లా విద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని నాయకులు నోటీసులో స్పష్టం చేశారు. ఇచ్చిన హామీని అమలు చేసి ఉపాధ్యాయుల్లో నెలకొన్న అసంతృప్తిని తొలగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రవికుమార్ (యూటీఎఫ్), నవీన్ పాటిల్ (యూటీఎఫ్), జనార్దన్ (ఎస్టీయూ), సుంకన్న (ఎస్టీయూ), ఇస్మాయిల్ (ఏపీటీఎఫ్1938), ఖాసీం జి (ఏపీటీఎఫ్257), హుస్సేన్ (ప్రధానోపాధ్యాయుల సంఘం), భీమన్న (డీటీఎఫ్), గోపాల్ (ఆప్టా)తో పాటు పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# ఏఈఈ ఉద్యోగ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

## పరీక్ష నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి -జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 20)**
విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) ఉద్యోగాల భర్తీకి నిర్వహించనున్న పరీక్షను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.
కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో (ఏఈఈ) ఉద్యోగ పరీక్ష నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 23 నుంచి 27వ తేదీ వరకు (ఏఈఈ) ఉద్యోగాల భర్తీకి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ బాధ్యతలను టిసిఎస్ చేపడుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.28 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, కర్నూలు జిల్లాలో సుమారు 4,982 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏపీఎస్పీడీసీఎల్, సిపిడిసిఎల్, ఈపీడీసీఎల్, జెన్కో, ట్రాన్స్‌కో సంస్థల్లో ఖాళీగా ఉన్న మొత్తం 630 పోస్టుల భర్తీకి ఈ నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు, పొరపాట్లకు తావులేకుండా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. అభ్యర్థుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్, రద్దీ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష సమయం మొత్తం కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రత్యామ్నాయ విద్యుత్ ఏర్పాట్లను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద హెల్త్ డెస్క్ ఏర్పాటు చేసి ప్రథమ చికిత్స సదుపాయాలను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను సూచించారు. అభ్యర్థుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ, ఇతర రవాణా సదుపాయాలను సమన్వయం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లో అనుమతించబోమని తెలిపారు. అభ్యర్థులు తమకు కేటాయించిన సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఇతర పోటీ పరీక్షలను నిర్వహించే సమయంలో అందిస్తున్న సహకారం మాదిరిగానే (ఏఈఈ) పరీక్ష నిర్వహణకు కూడా అన్ని శాఖలు పూర్తి స్థాయిలో సహకరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రెవెన్యూ అధికారులు, తహసీల్దార్ల సమన్వయంతో పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి, పరస్పర సమన్వయంతో పరీక్షను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ప్రదీప్ కుమార్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రాఘవులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషాద్రి, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, కర్నూలు రూరల్, కల్లూరు తహసీల్దార్లు రమేష్, ఆంజనేయులు, జీజీహెచ్ డీఎస్ఓ డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ట్రాన్స్‌కో పర్సనల్ ఆఫీసర్ సంతోష్, సబ్‌ఇన్‌స్పెక్టర్ శేఖర్ రెడ్డి, అయాన్ డిజిటల్స్, పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కర్నూలు గవర్నమెంట్ హాస్పిటల్ లోఅనారోగ్యంతో చికిత్స పొందుతున్న కార్యకర్తలను కాటసాని పరామర్శ.

### శకునాల గ్రామానికి చెందిన పరమేష్ నాయుడు గంధంపుల్లయ్యను పరామర్శించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే







**ఓర్వకల్లు ప్రతినిధి,ఆగస్టు 20(రిపబ్లిక్ న్యూస్)**
కర్నూలు జిల్లాఓర్వకల్లు మండలం: శకునాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి పరామర్శించారు. పాము కాటుకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పరమేష్ నాయుడు, గుండెపోటుతో చికిత్స పొందుతున్న గంధంపుల్లయ్య, అనారోగ్యంతో బాధపడుతున్న రాజులను కాటసాని రామభూపాల్ రెడ్డి పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అన్ని విధాలా అండగా ఉంటామని కాటసాని రామభూపాల్ రెడ్డి భరోసా ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో శకునాల పుల్లారెడ్డి మరియు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# చిన్న వయసులో పెళ్లిళ్లు చట్టరీత్యా నేరం

## - ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి



**బండి ఆత్మకూరు ,ఆగస్టు 20,( రిపబ్లిక్ న్యూస్):-** బాల, బాలికలకు చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి, జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి లక్ష్మీదేవి, స్థానిక ఏపిఎం గురప్పలు అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో బాలల సంరక్షణ,బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే దుష్పరిమానాలను వారు తెలియజేశారు. చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం వల్ల అనారోగ్యానికి గురికావడమే కాకుండా విద్యకు దూరమై భవిష్యత్తులో తీవ్ర విఘాతం కలుగుతుందని వారు హెచ్చరించారు. బాలికలు అర్ధాంతరంగా చదువును ఆపేసి బడికి దూరం అవుతారన్నారు. దీంతో భవిష్యత్తులో ఎంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 18 సంవత్సరాల లోపు బాలికలు, 21 సంవత్సరాల లోపు ఉన్న బాలురకు పెళ్లిళు చేయడం పూర్తిగా చట్ట విరుద్ధమన్నారు. ఎవరైనా చట్టాలను అతిక్రమించి చిన్న వయసులో పెళ్లిళ్లు చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఎక్కడైనా బాల్యవివాహాల ప్రయత్నం జరుగుతున్న లేదా బాలికలపై వేధింపులు, అఘాయిత్యాలు, ఆపదలు ఎదురైనప్పుడు ఉచిత హెల్ప్ లైన్ 1098 కి సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు రహస్యంగా ఉంచుతామని అధికారులు సూచించారు. అలాగే అనాధలు రక్షణ లేని పిల్లల కోసం పలు ఇన్స్టిట్యూషన్స్, శిశు గృహాలు, షెల్టర్ హోమ్ వంటి సేవలు అందిస్తున్నట్లు వారు వివరించారు. వీటితోపాటు చట్టబద్ధమైన దత్తత విధానాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అలాగే గ్రామాల్లో వివోఏలు గ్రామైక్య సంఘాల బాల్య వివాహాల సమాచారాన్ని అధికారులకు చేరవేయాలని మహిళలను కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, పొదుపు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# దళితవాడలోపోలీసుల పల్లెనిద్ర

## మాదకద్రవ్యాల పై అవగాహన సదస్సు - ఎస్సై సుజన్ కుమార్.





**రైల్వే కోడూరు ఆగస్టు 20 రిపబ్లిక్ న్యూస్.** గ్రామాలలో పల్లె నిద్రలో పోలీసులు కార్యక్రమంలో భాగంగా ఓబులవారిపల్లి మండలం జీవిపురం దళితవాడలో పోలీసులు చట్టాలు మాదకద్రవ్యాల పై అవగాహన సదస్సు గురువారం నిర్వహించినట్లు ఓబులవారిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్ తెలిపారు,
ప్రజలు చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకుండా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రతి ఒక్కరు చట్టానికి లోబడి నడుచుకోవాలని అన్నారు, అంతేకాకుండా గ్రామాల్లో మద్యం సేవించి అల్లర్లు సృష్టించిన,అలాగే జూదం కోడిపందెం ఎర్రచందనం వంటి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలు చేపడితే పీడీ యాక్ట్,పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున కఠిన శిక్షలు పడే అవకాశం ఉందని, రౌడీ షీటర్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు ఎవరైనా మద్యం సేవించి గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు రానున్న ఎన్నికలు పండుగల సందర్భంలో శాంతియుతంగా నడుచుకోవాలని ప్రజలు పండుగలు జరుపుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోలీస్ సిబ్బంది గంగయ్య రాష్ట్ర అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షుడు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు

# పేదల భూముల పై పెత్తందారుల కన్ను

## రెవిన్యూ కను సన్నల్లోనే భూ కబ్జాల జోరు.



**రైల్వే కోడూరు ఆగస్టు 20 రిపబ్లిక్ న్యూస్.**
పుల్లంపేట మండలం రంగంపల్లి పంచాయతీ ఆర్ రాచపల్లి ఎస్ టి లకు కేటాయించిన భూములపై పెత్తందారుల పెత్తనంతో ముడుపులు ముట్టాయో ఇంకేమైనా ముట్టిందో రెవిన్యూ అధికారుల కనసన్నల్లో పేదల భూములపై పెత్తందారుల కన్ను పడి యంత్రాలతో చదును చేసే వరకు వెళ్ళింది వ్యవహారం ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూన్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ఎం జయరామయ్య రెవిన్యూ అధికారుల తీరు పట్ల తీవ్ర విమర్శలు చేశారు,సర్వే నంబర్ 585 లో ఉన్న భూమి గత 20 సంవత్సరాల క్రితం ఎస్టీలకు ఇవ్వాలని రెవిన్యూ అధికారులే సబ్ డివిజన్ చేయడం జరిగినదని అప్పటి నుండి ఆ భూములను ఎస్టీలకు కేటాయించి అభములో వ్యవసాయం చేసుకునేందుకు సహాయ సహకారాలు ప్రభుత్వం అందించకపోవడంతో నిరుపేదలైన ఎస్టీలు ఏమి చేయలేని స్థితిలో ఉండిపోవడంతో ఆ భూమి పైన భూ చోరులు, పెత్తందారుల కన్ను బడి ఆ భూమి పైన ఆటంకాలు సృష్టిస్తూ కబ్జాలు చేస్తూ ఎస్టీలను బెదిరిస్తూ! నేటికీ డోజర్ పెట్టి దున్నే స్థితికి రావడం వెనుక రెవెన్యూ అధికారుల హస్తం ఉన్నట్లు వాళ్ల అవినీతికి అద్దం పడుతుందన్నారు, వీటన్నిటికీ పుల్లంపేట రెవెన్యూ వారి పూర్తి సహాయ సహకారాలతోనే జరుగుతున్నాయన్నది జగమెరిగిన సత్యమని గ్రామస్తులు ప్రజా సంఘ నాయకులు ఆరోపిస్తున్నారన్నారు, గత 20 రోజుల క్రితం ఆర్డీవో రామ్మోహన్ ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగినదని , ఆ సందర్భంగా ఆయన స్పందించి ఎస్టీలకు ఆ భూమిని పంచుతామని హామీ కూడా ఇచ్చారని ఇంతలోనే
20 రోజులు కూడా గడవకముందే మళ్ళీ కబ్జాలకు తెరలేపారు, ఆర్డిఓ ఆదేశాలను బే ఖాతరుచేసి ఎవరూ చూడలేదని పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగినట్లు రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు జండా ఊపడంతో డోజర్ పెట్టి అక్కడ పొలాన్ని దున్నుకుంటున్నారన్నారు, కామ్రేడ్లు ఈ దృశ్యం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు కలెక్టర్ సారు మీరైనా స్పందించి ఎస్టీలకు న్యాయం చేయాలని కోరుతూన్నామన్నారు, జిల్లా యంత్రాంగం స్పందించకుంటే సోమవారం రోజు తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర ధర్నా చేస్తామని సందర్భంగా కామ్రేడ్లు హెచ్చరించారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**ఆర్ఎస్ఐ హనుమంతు**

**మత్తు భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం**

**భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ**

**మత్తుపై ఈగల్ టీం అవగాహన సదస్సు**

**అనంతపురం క్రైమ్, ఆగస్టు 20,(రిపబ్లిక్ న్యూస్):** విద్యార్థులు యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆర్ఎస్ఐ హనుమంతు పేర్కొన్నారు. మత్తు వినియోగం వల్ల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందనిభాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ అన్నారు.గురువారం నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న భాష్యం పాఠశాలలో ఈగల్ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

**మత్తు వినియోగం విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం**

ఈ సందర్భంగా ఆర్ఎస్ఐ హనుమంతు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మంచి స్నేహితులను ఎంచుకోవడం ద్వారా చెడు ప్రభావాలకు






దూరంగా ఉండవచ్చన్నారు. మత్తు పదార్థాల వినియోగం విద్యార్థుల ఆరోగ్యం, చదువు, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమస్యలు ఎదురైతే టోల్‌ఫ్రీ నంబరు 1972కు సమాచారం ఇవ్వాలని, లేదంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలను సంప్రదించాలని సూచించారు. భాష్యం పాఠశాలలో ఈగల్ టీం సభ్యులను నియమించడం అభినందనీయమని పేర్కొంటూ పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

**మత్తు నివారణలో విద్యార్థుల పాత్ర కీలకం**

భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, గంజాయి, పొగాకు మాత్రమే వ్యసనాలు కాదని, చరవాణి (మొబైల్)ను అతిగా ఉపయోగించడం, దుర్భాషలాడటం, మైనర్ విద్యార్థులు ధూమపానం చేయడం, వాహనాలను నిర్లక్ష్యంగా నడపడం వంటి చెడు అలవాట్లు కూడా విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, వినయ విధేయతలతో విద్యను అభ్యసిస్తూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమాజంలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు."డ్రగ్స్‌కు నో " చెప్పండి.. ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు స్వాగతం పలకండి అనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్‌రామ్, అనంతపురం జిల్లా జెడ్‌ఈఓ రవివర్మ, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, హెచ్‌ఎం, ఈగల్ టీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హంద్రీ-నీవా నీటిని చెరువులకు మళ్లించాలి

**ఎల్-నినో తో తీవ్ర నీటి ఎద్దడి**

**ప్రజలకే కాదు.. మూగజీవాలకు తప్పని తిప్పలు**

**ప్రతి మండలానికి రూ.కోటి కేటాయించాలి**

**రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత**

**అనంతపురం ప్రతినిధి, ఆగస్టు20,(రిపబ్లిక్ న్యూస్):** ఎల్-నినో ప్రభావంతో అనంతపురం జిల్లాలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. జీరో అవర్‌లో ఆమె మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో వెయ్యి అడుగుల లోతు వరకు బోర్లు వేసినా నీరు లభించని పరిస్థితి ఉందన్నారు. అనంతపురం రూరల్ మండలంలో సుమారు 70 వేల మంది ఓటర్లు ఉండగా, అనేక కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ప్రజల అవసరాలకు సరిపోవడం లేదని, మరిన్ని ట్యాంకర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని ఇతర మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని పేర్కొంటూ తాగునీటి అవసరాల కోసం ప్రతి మండలానికి రూ.కోటి చొప్పున నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. హంద్రీ-నీవా ద్వారా నియోజకవర్గంలోని చెరువులకు కనీసం 30 శాతం నీటిని మళ్లించాలని కోరారు. చెరువులకు నీరు చేరితే భూగర్భ జలమట్టం కొంత మేర మెరుగుపడటంతోపాటు పశువులకు నీటి సౌకర్యం కలుగుతుందని తెలిపారు.



నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న రైతు భరోసా కేంద్రాలు, స్వర్ణ గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చిన సూపర్ సిక్స్**

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు కేవలం సంక్షేమ కార్యక్రమాలు మాత్రమే కాదని, సామాన్య ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే పథకాలుగా మారాయని పరిటాల సునీత అన్నారు. అసెంబ్లీలో జరిగిన లఘు చర్చలో ఆమె మాట్లాడుతూ "తల్లికి వందనం" పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 42 లక్షల మంది తల్లులకు రూ.10 వేల కోట్ల మేర ప్రయోజనం కల్పించామని, 67 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో 40 వేల మందికి రూ.52 కోట్ల మేర ప్రయోజనం అందిందని తెలిపారు."అన్నదాత సుఖీభవ" కింద పంటల సాగు సమయంలో రైతులకు రూ.20 వేల చొప్పున అందిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 47 లక్షల మంది రైతులకు సుమారు రూ.9 వేల కోట్లు జమ చేశామని చెప్పారు. రాప్తాడు నియోజకవర్గంలో 51 వేల మందికి రూ.136 కోట్ల మేర సాయం అందిందన్నారు. "దీపం" పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేపట్టామని, "యువగళం" ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు."ఎన్టీఆర్ భరోసా" పింఛన్ల ద్వారా రెండేళ్లలో 65.50 లక్షల మందికి రూ.63 వేల కోట్లకుపైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రతి నెలా మొదటి తేదీనే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి వెంటనే మంజూరు చేయాలని కోరారు.

**ప్రభుత్వం డ్రైవర్లు, కండక్టర్ల సంఖ్యను పెంచాలి**

మహిళలకు ఉచిత ప్రయాణం.. బస్సులు పెంచాలి
"స్త్రీశక్తి" పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం మంచి నిర్ణయమని సునీత అన్నారు. అయితే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఒక్కో బస్సులో 60 నుంచి 80 మంది వరకు ప్రయాణిస్తున్న పరిస్థితి ఉందన్నారు. రద్దీ కారణంగా ప్రయాణికులతోపాటు డ్రైవర్లు, కండక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్ని చోట్ల బస్సులు స్టాపుల్లో నిలపడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. పెరిగిన ప్రయాణ అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్టీసీ బస్సులు కేటాయించడంతోపాటు డ్రైవర్లు, కండక్టర్ల సంఖ్యను పెంచాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు.

# జిల్లా కలెక్టర్‌ని కలిసిన బాలల సంక్షేమ సమితి సభ్యులు



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 20)**
కొత్తగా నియమతులైన బాలల సంక్షేమ సమితి సభ్యులు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ కమిటీలో చైర్ పర్సన్ అయినటువంటి అంబటి ప్రవీణ్ గారు మరియు సభ్యులైన పెరుమాళ్ళ లెనిన్ బాబు, శివపురం మాధవి, సౌభాగ్య ధరణిల నూతన కమిటీ కలవడం జరిగింది. కలెక్టర్ గారు నూతన కమిటీతో జిల్లాలో పిల్లల సమస్యల కోసం నిరంతరం మీ యొక్క సేవలు వినియోగించాలని తెలిపారు. కమిటీ చైర్ పర్సన్ అయినటువంటి ప్రవీణ్ గారు జిల్లాలో బాల్య వివాహాలు మరియు భిక్షాటన, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించడానికి తమ సాయి శక్తుల లైన్ డిపార్ట్మెంట్స్ తో కలిసి పని చేస్తామని తెలియపరిచారు. అనంతరం సి క్యాంప్ లో ఉన్నటువంటి శిశు గృహను సందర్శించారు.

## బిక్షాటన చేస్తున్న పిల్లలను స్పెషల్ డ్రైవ్ చేస్తున్న అధికారులు.



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ )**
జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ గారి ఆదేశాల మేరకు కర్నూలు మరియు ఆదోని డివిజన్ల లో బస్టాండ్, రైల్వే స్టేషన్ లు మరియు దేవాలయాలలో బిక్షాటన, బాలకార్మికులు మరియు వీధి బాలల కోసం సంబంధిత శాఖలను సమన్వయం చేసుకొని ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగానే రెండు టీమ్ లుగా డీసీపీయు యూనిట్ సిబ్బంది మరియు చైల్డ్ హెల్ప్ లైన్ -1098 సిబ్బంది కలిసి కర్నూలు డివిజన్ లో ఇద్దరు పిల్లలను రాజ్ విహార్ సెంటర్ దగ్గర గుర్తించారు. అనంతరం ఆ అబ్బాయిని లీగల్ ప్రొహిబిషన్ ఆఫీసర్ శ్రీలక్ష్మి గారి సమక్షంలో బాలల సంక్షేమ సమితి ముందు హాజరు పరిచి వారి యొక్క సమక్షంలో తల్లిదండ్రులకి అప్పగించటం జరిగింది.ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ -1098 కౌన్సిలర్ పద్మావతి, డీసీపీయు యూనిట్ కౌన్సిలర్ నాగేశ్వర రావు, సోషల్ వర్కర్ నరసింహులు, ఔట్ రీచ్ వర్కర్ రంగమ్మ, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది దుర్గ, భాస్కర్, విమల, సునీత పాల్గొన్నారు.

# రైతులకు నీళ్లు లేవు.. పరిశ్రమలకు నీళ్లా కూటమి సర్కార్‌పై కాటసాని ఫైర్

**బనగానపల్లె ఆగస్ట్ 20 రిపబ్లిక్ న్యూస్**
నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.
రాయలసీమ ప్రాంతంలో కరువు ఛాయలు అలుముకున్నాయని, శ్రీశైలం డ్యామ్‌లో నీటి మట్టం 875 అడుగులకు చేరినప్పటికీ ఎస్ఆర్‌బీసీ కాలువకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.
గాలేరునగరి ద్వారా అవుకు రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేస్తున్నప్పటికీ, అవుకు రిజర్వాయర్ నుంచి పరిశ్రమలకు నీటిని మళ్లిస్తున్నారని విమర్శించారు.
రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతుంటే పరిశ్రమలకు మాత్రం నీటిని కేటాయించడం కొత్త సంప్రదాయానికి తెరలేపినట్లుగా ఉందన్నారు.
కనీసం ఆరుతడి పంటలకు కూడా సాగునీరు అందించలేని పరిస్థితి నెలకొందని, నంద్యాల జిల్లాకు



చెందిన మంత్రులు, శాసనసభ్యులు ఈ ప్రాంత ప్రజల నీటి సమస్యలపై గళమెత్తాలని డిమాండ్ చేశారు. రైతుల కన్నీళ్లను జిల్లా మంత్రులు చూడాలని, జిల్లాలో ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.అదేవిధంగా ఎరువుల ధరలు పెరిగాయని, వాటిని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఎరువుల విక్రయాలను రైతు భరోసా కేంద్రాల ద్వారానే నిర్వహిస్తూ పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు.
ఎస్ఆర్‌బీసీ కాలువ నుంచి పంట కాలువలకు సాగునీరు అందించిన ఘనత దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి దక్కుతుందని పేర్కొన్నారు. ఎస్ఆర్‌బీసీ కాలువ నిర్మాణానికి పునాది వేసిన ఘనత దివంగత కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, పీవీ నరసింహారావులకు దక్కుతుందని గుర్తుచేశారు.
గోరుకల్లు, అవుకు రిజర్వాయర్లకు సంబంధించిన నీటిని రైతుల ప్రయోజనాల కోసం వినియోగించాలని కాటసాని రామిరెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైతే అవుకు రిజర్వాయర్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.
ఈ సమావేశంలో అవుకు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్సీపీ జిల్లా పార్టీ అధికార ప్రతినిధి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, గడ్డం బాషా తదితరులు పాల్గొన్నారు

# ఆధునిక సాంకేతిక విప్లవానికి ఆద్యుడు రాజీవ్ గాంధీ

## దేశం కోసం ప్రాణాలర్పించిన ఘనత ఆ మహనీయుడిదే: నీలం మధు ముదిరాజ్

## చిట్కుల్‌లో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 20**

ఆధునిక సాంకేతిక విప్లవానికి ఆద్యుడు, టెలికాం రంగంలో సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టి భారతదేశాన్ని సాంకేతిక రంగంలో ముందుకు నడిపించిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు.

రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని మంగళవారం చిట్కుల్‌లోని ఎన్‌ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ భారతదేశంలో డిజిటల్ విప్లవానికి రాజీవ్ గాంధీ నాంది పలికారని అన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీకి పెద్దపీట వేస్తూ అనేక సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపించారని కొనియాడారు. విమానయానం, టెలికమ్యూనికేషన్, కంప్యూటర్ రంగాల అభివృద్ధికి పన్నుల తగ్గింపు వంటి చర్యలతో సాంకేతిక రంగాన్ని ప్రోత్సహించారని తెలిపారు.

రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగానే నేడు భారతదేశం సాంకేతిక రంగంలో ప్రపంచ స్థాయిలో ముందుకు సాగుతోందని అన్నారు. దేశ అభివృద్ధి కోసం కృషి చేస్తూ, దేశం కోసం ప్రాణాలర్పించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని పేర్కొన్నారు. భారతదేశ అభివృద్ధికి ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.

రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రపంచ స్థాయిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నారని నీలం మధు తెలిపారు.




ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సంగన్నగారి గోపాల్, దస్తగిరి, మన్నె రాఘవేంద్ర, నారాయణదాసు, సంపత్, కాంగ్రెస్ నాయకులు అశోక్, శ్రీనివాస్, వీరేష్, అనిల్, రాజ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# పూజల్లో పోకలు, బాదాములు, ఖర్జూరాలు ...!

## వినియోగం వెనుక ఆధ్యాత్మిక రహస్యం !

**రాయికల్ మండలం ఆగస్టు,20( రిపబ్లిక్ న్యూస్)**

సనాతన హిందూ సంప్రదాయంలో పూజలు, వ్రతాలు, యజ్ఞాలు, గృహప్రవేశాలు, వివాహాలు తదితర శుభకార్యాలు నిర్వహించేటప్పుడు వినియోగించే వివిధ రకాల పూజా ద్రవ్యాలలోపోకలు (వక్కలు), ఖర్జూరాలు, బాదాము లకు ప్రత్యేక స్థానం ఉంటుందని రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు పండితులు చెరుకు మహేశ్వర శర్మ తెలిపారు . శ్రావణ మాసంలో జరుపుకునే వివిధ పూజా కార్యక్రమాల్లో వీటిని ఉపయోగించడం ఒక ఆచారంగా మాత్రమే కాకుండా, వాటి వెనుక ఆధ్యాత్మిక భావన, శుభసంకేతాలు, ఆరోగ్యపరమైన ప్రయోజనాలు ఉన్నాయని చెరుకు మహేశ్వర శర్మ వివరించారు.





**పరిపూర్ణతకు, దైవిక సమర్పణకు ప్రతీక**

పూజా విధానంలో తాంబూల సమర్పణకు ఎంతో ప్రాధాన్యత ఉంది. తమలపాకుతో పాటు వక్కను (పోకను) దేవతకు సమర్పించడం సనాతన ఆచారంలో భాగం. కొన్ని ప్రాంతీయ సంప్రదాయాల్లో పోక చెక్కను గణపతి ప్రతిరూపంగా భావించి పూజించడం కూడా కనిపిస్తుంది. తాంబూల సమర్పణను శుభానికి, మంగళానికి, పరిపూర్ణతకు సంకేతంగా భావిస్తారు. మనసా, వాచా, కర్మణా భగవంతునికి సమర్పణ భావంతో పూజా ద్రవ్యాలను అర్పించడం ఈ ఆచారంలోని అంతరార్థంగా చెప్పవచ్చు.

**బాదాం, ఖర్జూరాలు సాత్విక నైవేద్యానికి ప్రతీకలు**

బాదాములు, ఖర్జూరాలు వంటి ఎండు ఫలాలను పూజల్లో నైవేద్యంగా, ప్రసాదంగా వినియోగించడం అనేక ప్రాంతాల్లో ఆచారంగా ఉంది. ఇవి సహజంగా లభించే ఆహార పదార్థాలు కావడంతో సాత్విక ఆహారానికి ప్రతీకలుగా భావిస్తారని ఆయన తెలిపారు.

బాదాములను సంప్రదాయ పరంగా జ్ఞానం, వివేకం, బుద్ధిశక్తికి ప్రతీకగా పూజలో బాదాములను సమర్పిస్తారని ఆయన చెప్పారు.కుటుంబ సభ్యులకు జ్ఞానం, వివేకం, విద్యాభివృద్ధి కలగాలని కోరుకునే భావన ఇందులో కనిపిస్తుందని చెప్పారు.

ఖర్జూరం సహజమైన తీపిని కలిగి ఉంటుంది. అందువల్ల సంప్రదాయ విశ్వాసంలో దీనిని మధురమైన భక్తికి, శక్తికి, సంతోషానికి ప్రతీకగా పూజల్లో వాడుతారని అన్నారు.

"మన మాట మధురంగా ఉండాలి.. మన మనసు మధురంగా ఉండాలి.. మన భక్తి మధురంగా ఉండాలి" అనే జీవన సందేశాన్ని ఖర్జూరం మనకు గుర్తుచేస్తుందని తెలిపారు.

**అక్షయత్వంసమృద్ధికి సంకేతం**

ఎండు ఫలాలు సాధారణంగా తాజా పండ్లతో పోలిస్తే ఎక్కువకాలం నిల్వ ఉంటాయి. అందువల్ల వాటిని అక్షయత్వానికి, నిలకడకు, సమృద్ధికి ప్రతీకలుగా మన పూర్వీకులు భావించినట్లు చెప్పవచ్చని అన్నారు

పూజల్లో వీటిని సమర్పించడం ద్వారా ఇంట్లో సుఖసంతోషాలు, ఐశ్వర్యం, ఆరోగ్యం, శ్రేయస్సు నిరంతరం ఉండాలని భగవంతుడిని ప్రార్థించే భావన అంతర్లీనంగా ఉంది.

**ప్రకృతిపట్ల కృతజ్ఞత**

మన సనాతన సంప్రదాయంలో ప్రకృతి నుంచి లభించిన పదార్థాలను దైవానికి సమర్పించడం ద్వారా ప్రకృతిపట్ల కృతజ్ఞతను వ్యక్తం చేసే భావన కూడా కనిపిస్తుంది.

ధాన్యాలు, పండ్లు, పుష్పాలు, ఆకులు, కాయలు, ఎండు ఫలాలు ఇలా ప్రకృతి ప్రసాదించిన అనేక పదార్థాలను పూజల్లో వినియోగించడం వెనుక "మనకు లభించినది అంతా దైవ ప్రసాదమే" అనే భావన ఉంది.

**ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్య ప్రయోజనం**

పూజ పూర్తయిన అనంతరం బాదాములు, ఖర్జూరాలు వంటి పదార్థాలను ప్రసాదంగా స్వీకరించడం వల్ల శరీరానికి కొంత శక్తి, పోషకాలు లభిస్తాయి. బాదాముల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్, పీచు, కొన్ని విటమిన్లుఖనిజాలు ఉంటాయి. ఖర్జూరాల్లో సహజ చక్కెరలు, పీచు వంటి పోషకాలు ఉంటాయి.వీటిని తినడం వల్ల వాత, పిత్త, కఫాలు తప్పనిసరిగా సమతుల్యం అవుతాయని ఆయుర్వేద వైద్యం లో భావిస్తారు.

**భక్తిఆరోగ్యంప్రకృతి**

పూజల్లో పోకలు, బాదాములు, ఖర్జూరాల వినియోగాన్ని పరిశీలిస్తే, వాటిలో కేవలం ఆచారం మాత్రమే కాకుండా దైవానికి సమర్పణ, శుభసంకల్పం, సమృద్ధి ఆకాంక్ష, ప్రకృతిపట్ల కృతజ్ఞత, ప్రసాదం ద్వారా ఆహార విలువను పొందడం వంటి అనేక భావనలు మిళితమై ఉన్నట్లు తెలుస్తుందని అన్నారు.

మన పూర్వీకులు ఏర్పరచిన ఈ సంప్రదాయాల్లో ప్రతి వస్తువుకూ ఒక సంకేతార్థాన్ని అన్వయిస్తూ, "దైవానికి సమర్పించినది పవిత్రం; ప్రసాదంగా స్వీకరించినది ఆరోగ్యకరం; ప్రకృతి ప్రసాదించినది కృతజ్ఞతతో స్వీకరించాలి" అనే జీవన సందేశాన్ని అందించారని కొనియాడారు.అందుకే పూజల్లో పోకలు, బాదాములు, ఖర్జూరాల వినియోగం ఒక సాధారణ ఆచారం మాత్రమే కాదు; భక్తికి, శుభ సంకల్పానికి, ప్రకృతి పట్ల కృతజ్ఞతకు, ఆరోగ్యచింతనను కలగలిపిన సనాతన సంప్రదాయ విశిష్టతకు ప్రతీకగా పేర్కోనవచ్చునిచెరుకు మహేశ్వర శర్మ వివరించారు.

# వర్ల రామయ్యకు ఘన అభినందనలు

**విజయవాడ ప్రతినిధి, ఆగస్టు 20,(రిపబ్లిక్ న్యూస్):**

గవర్నర్ కోటాలో శాసన మండలి సభ్యుడిగా (ఎమ్మెల్సీ) ఎన్నికైన టీడీపీ సీనియర్ నాయకుడు వర్ల రామయ్యకు అభినందనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా వర్ల శంకర్ ఆధ్వర్యంలో ఆయన మిత్ర బృందం, పంచాయతీరాజ్ ఉద్యోగులు విజయవాడలో వర్ల రామయ్యను కలిసి పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయనకు అభినందనలు తెలిపారు.



**శాసన మండలి సభ్యుడిగా అవకాశం దక్కడం పట్ల హర్షం**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్ల రామయ్యకు గవర్నర్ కోటాలో శాసన మండలి సభ్యుడిగా అవకాశం దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజా ప్రయోజనాల కోసం పనిచేసే నాయకుడిగా వర్ల రామయ్యకు మంచి గుర్తింపు ఉందన్నారు. శాసన మండలిలో సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రజల సమస్యలను మరింత బలంగా వినిపించాలని ఆకాంక్షించారు. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన సమస్యలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం తదితర అంశాలపై శాసన మండలి వేదికగా తన వాణిని వినిపించాలని వారు కోరారు.

**ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలి**

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకమని, ఆ రంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి వర్ల రామయ్య తన వంతు కృషి చేస్తారనే నమ్మకం ఉందన్నారు.వర్ల రామయ్య రాజకీయ అనుభవం, ప్రజా సమస్యలపై అవగాహన శాసన మండలిలో రాష్ట్రానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. అనంతరం వర్ల రామయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వర్ల శంకర్ మిత్ర బృందం సభ్యులు, పంచాయతీరాజ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంఘటన్ సృజన్ అభియాన్

## సంస్థాగత బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 20**




కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా చేపట్టిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు నడిపించడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని అన్నారు. యువతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి ఆయన తీసుకున్న చర్యలు భారతదేశ ప్రగతికి పునాది వేశాయని పేర్కొన్నారు.దేశ ఐక్యత, అభివృద్ధి కోసం రాజీవ్ గాంధీ చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని నాయకులు సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయడం, ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించడం ద్వారా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు ) మార్కెటింగ్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డిఆత్మకమిటి డైరెక్టర్ చిట్యాల మధు, ఖాలేదు, కౌన్సిలర్లు అరుణ్,అనిల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# ఓటర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## : వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి మిద్దింటి కిషోర్

**చౌడేపల్లి ప్రతినిధి ఆగస్టు 20 రిపబ్లిక్ న్యూస్**




ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి మిద్దింటి కిషోర్ కోరారు చేశారు. గురువారం స్థానిక మండల పరిపాలన భవనంలో జరుగుతున్న ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియపై ఆయన అధికారులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో సుమారు 1,950 మంది ఓటర్లకు వివిధ రకాల సవరణలకు సంబంధించి నోటీసులు అందాయని తెలిపారు. ఇంటిపేరు, తండ్రి పేరు, పేర్లలో తప్పులు దొర్లాయని వారందరికీ నోటీసులు ఇచ్చారని, ఈ సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకూడదని పేర్కొన్నారు.వివిధ ప్రాంతాల నుంచి సవరణల కోసం దరఖాస్తు చేసుకున్న ఓటర్లు ఇబ్బందులు పడకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. నోటీసులు పొందిన వారందరికీ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ, రీ-వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేసి ఓటర్ల సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సరైన వివరాలతో కూడిన ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.

# బోయకొండ గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం 87.20 లక్షలు: 37 రోజులకు లెక్కింపు

**చౌడేపల్లి ప్రతినిధి ఆగస్టు 20 రిపబ్లిక్ న్యూస్**



అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలం దిగువపల్లి గ్రామంలో వెలసిన ప్రముఖ శక్తి క్షేత్రం భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానంలో గురువారం హుండీ లెక్కింపు ఘనంగా నిర్వహించారు. గత 37 రోజులకు గాను నిర్వహించిన ఈ లెక్కింపులో ఆలయానికి భారీగా కానుకలు, ఆదాయం సమకూరినట్లు యు ఉప కమిషనర్ ఏకాంబరం తెలియజేశారు

ప్రధాన హుండీ ద్వారా రూ 87,20,769.00లు

బంగారు కానుకలు: 23.005 గ్రాములు (23 గ్రాముల 5 మిల్లీగ్రాములు)

వెండి కానుకలు: 250.012 గ్రాములు (250 గ్రాముల 12 మిల్లీగ్రాములు)

అన్నదానం హుండీ ఆదాయం: 12,873.00శ్రీ రణభేరి గంగమ్మ దేవస్థానం ఆదాయం: 65,851.00

**సమకూరిన విదేశీ కరెన్సీ:** టాంజానియా : 5000 షిల్లింగ్స్ (1 నోటు), 2000 షిల్లింగ్స్ (1 నోటు)

కువైట్ : 1 కరెన్సీ నోటుకెనడా : 10 డాలర్లు (1 నోటు)ఒమన్ : 100 బైసా (2 నోట్లు)

సౌదీ అరేబి : 1 రియాల్ (1 నోటు)ట్రినిడాడ్ అండ్ టొబాగో 1 డాలర్ (1 నోటు), 10 డాలర్లు (1 నోటు)థాయ్‌లాండ్: 20 థాయ్ భట్ (1 నోటు) హుండీ లెక్కింపులో దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ శశి కుమార్ చౌడేపల్లి పోలీస్ సిబ్బంది, ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ (చౌడేపల్లి) ప్రతినిధులు, దేవస్థాన అర్చకులు సేవకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అల్మాయిపేట్ గ్రామంలో బీఆర్ఎస్ యువ నాయకుడు దండు అనిల్ కుమార్ పుట్టినరోజు వేడుకలు

## మాజీ సర్పంచ్ బుడ్డోల్ల రవిశంకర్ ఆధ్వర్యంలో ఘనంగా






**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 20**



అందోల్ మండలం అల్మాయిపేట్ గ్రామంలో బి ఆర్ఎస్ యువ నాయకులు దండు అనిల్ కుమార్ పుట్టినరోజు వేడుకలను అంగరంగ వైభవంగా మాజీ సర్పంచ్ బుడ్డోల్ల రవిశంకర్ దండు బీరప్ప ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బుడ్డోల్ల రవిశంకర్ మాట్లాడుతూ ఆయురారోగ్యం సుఖ సంతోషాలు శాంతి ఐశ్వర్యం సమృద్ధి దీర్ఘాయుష్షు ఎల్లవేళలా మరెన్నో పుట్టినరోజు వేడుకలను జరుపుకోవాలని ఆయన కొనియాడారు ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ నాయకులు శంకర్ గౌడ్ చాకలి మల్లేశం కమ్మరి ప్రభు బేగరి పెంటయ్య గడ్డి బిక్షపతి పెద్ద గొల్ల సత్యనారాయణ మంగలి మహేష్ కుమ్మరి సాయికుమార్ నరేష్ బుడ్డొల్ల వసంత్ తదితరులు పాల్గొన్నారు

# మేడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా కొంక వేణు పదవి బాధ్యతల స్వీకరణ





**రాయికాల్ మండలం ఆగష్టు,20( రిపబ్లిక్ న్యూస్)**జగిత్యాల్ జిల్లా మేడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా కొంక వేణు బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డీఈఓ రమేశ్ బాబు ఆదేశాల మేరకు ఆయన ఈ బాధ్యతలను స్వీకరించారు ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.కళాశాల సమగ్ర అభివృద్ధికి, విద్యార్థుల ఉత్తమ ఫలితాల సాధనకు నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపాల్ కొంక వేణు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపన్యాసకులు గుర్రాల సాయికృష్ణ, రాంబాబు, అనీష్, రాజు, విశ్వప్రసాద్, లక్ష్మణ్, జ్ఞానేశ్వర్, నాగేశ్వరి, అరుణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రాయికల్ చొప్పదండి నర్సయ్య మరణించగా యూనియన్ బ్యాంక్ ప్రమాద బీమా పథకం ద్వారా..

## -రెండు లక్షల రూపాయలు చెక్ కుటుంబీకులకు అందించిన యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎస్, నరేష్



**రాయికల్ మండలం ఆగస్టు 20( రిపబ్లిక్ న్యూస్)** ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం ద్వారా కేవలం 20 రూపాయలు ప్రీమియం తో రెండు లక్షల ప్రమాద బీమా సౌకర్యాఒ పొందవచ్చునని రాయికల్ యూనియన్ బ్యాంక్ శాఖ మేనేజర్ ఎస్ నరేష్ తెలిపారు జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన చొప్పదశీడి నరసయ్య గతంలో ప్రమాదంలో మృతి చెందారు ఆయన రాయికల్ పట్టణంలోని యూనియన్ బ్యాంకు లో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో సభ్యత్వం పొందగా అతను ప్రమాదవశాత్తు మరణించగా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద మంజూరైన రెండు లక్షల రూపాయల బీమా మొత్తాన్ని బ్యాంక్ శాఖ మేనేజర్ ఎస్ నరేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ తక్కువ ప్రీమియంతో ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించే ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు అతి తక్కువతో ప్రధానమంత్రి ప్రీమియంతో ప్రమాద బీమా సురక్ష యోజన పథకంలో చేరాలని ఆయన అన్నారు

## హామీలు అమలు చేయాలి.. పెండింగ్ బిల్లులు చెల్లించాలి

### మంత్రి పర్యటన సందర్భంగా జనసేన సీనియర్ నాయకులు బెక్కం జనార్ధన్ డిమాండ్



**రాయికల్ మండలం ఆగస్టు20( రిపబ్లిక్ న్యూస్)** జగిత్యాల జిల్లాకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటనకు వస్తున్న నేపథ్యంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు బెక్కం జనార్ధన్ పలు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అభివృద్ధి కార్యక్రమాలకు జనసేన వ్యతిరేకం కాదని, అయితే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు, ఇందిరమ్మ ఇళ్ల ఫైనల్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ఇళ్ల నిర్మాణంలో పనిచేసిన కార్మికులకు సంబంధించిన బకాయిలను కూడా వెంటనే చెల్లించి వారి శ్రమకు న్యాయం చేయాలని అన్నారు.అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన వృద్ధులకు వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని, పింఛన్ల కోసం అర్హులైన వారికి మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరారు.ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కేవలం పర్యటనలు, కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమిటని బెక్కం జనార్ధన్ ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ప్రజల హక్కులు, సంక్షేమం కోసం జనసేన పార్టీ తరఫున శాంతియుతంగా నిరసన తెలియజేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## జహీరాబాద్‌లో జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన నియామకాలు



**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 20** తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జహీరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు శెట్టి అశోక్, జాతీయ ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకటేష్ ఆదేశాల మేరకు నూతన పదాధికారులను నియమించారు.జహీరాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా ఎం. రాజేందర్, జనరల్ సెక్రెటరీగా సి.ఎస్. శ్రీనివాస్, ఆందోల్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా ఎం.ఎస్. రాజు, కోశాధికారిగా కే. శ్రీనివాస్ లను నియమించారు.ఈ సందర్భంగా జహీరాబాద్ సీఐ ఆర్. రవి నూతన పదాధికారులకు నియామక పత్రాలు అందజేసి అభినందించారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేస్తామని నూతన పదాధికారులు తెలిపారు.కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఘనంగా జోగిపేట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుమారుడి వివాహ వేడుక

### - హైదరాబాద్ నాగోల్ లో వివాహం - హాజరైన ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు



**రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 20** జోగిపేట మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాకూరి వెంకటేశం గారి ఏకైక పుత్రుడి వివాహ వేడుక గురువారం హైదరాబాద్ లోని నాగోల్ లో గల ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగింది.ఈ వివాహ కార్యక్రమానికి జోగిపేట పట్టణానికి చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం విందు భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ వివాహ వేడుకలో రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాస్, కోసికే రాజశేఖర్, చేనేత సహకార సంఘ అధ్యక్షులు పడిగే సత్యం, ఆత్మ కమిటీ, చేనేత సొసైటీల డైరెక్టర్ చిట్యాల మధు, మాజీ కౌన్సిలర్లు, పట్లోళ్ల ప్రవీణ్ కుమార్, పైతర గారి దుర్గేష్, నాయకులు ఆకుల నందు, ప్రశాంత్, నాగరాజు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

# యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు ఘనత రాజీవ్ గాంధీదే





**రాయికల్ మండలం ఆగస్టు 20( రిపబ్లిక్ న్యూస్)** ప్రజాస్వామ్యంలో యువతను భాగస్వామ్యం చేసేందుకు ఓటు హక్కును 21 ఏళ్ల నుండి 18 ఏళ్ళకు తగ్గించిన ఘనత దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేనని కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవీందర్ రావు అన్నారు.గురువారం రాయికల్ పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూల మాల వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి, నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని 61వ సవరణ శాసనసభ,లోక్ సభలో ఓటు వేసే వయస్సును 21 నుండి18 సంవత్సరాలకు తగ్గించేందుకు భారత రాజ్యాంగంలోని 326వ ఆదికరణ సవరణ బిల్లును 1989 మార్చి28 న ఆమోదం చేశారన్నారు.ఐటీ పితామహుడు అతిపిన్న వయసులోనే భారతదేశాన్ని అగ్రరాజ్యాల సరసన నిలబెట్టిన గొప్ప యోధుడు,ఆధునిక భారతవానికి పునాదులు వేసి అణగారిన బతుకుల్లో వెలుగులు నింపి తుది శ్వాస వరకు దేశం కోసమే బతికిన మహానేత భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ అని కొనియాడారు.స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కృషితో పాటు కేంద్రం నుండి నేరుగా స్థానిక సంస్థలకు నిధులు అందించేందుకు మార్గం సుగమం చేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటి పెల్లి గంగారెడ్డి,సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వాసం రాజేందర్,మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు,హనుమాన్ ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్,జిల్లా ఎస్టి సెల్ అధ్యక్షులు లౌవుడియా సురేందర్,జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొద్దుల శివ,నాయకులు కోల శ్రీనివాస్,తంగేళ్ల రమేష్,పడిగెల రవీందర్,గన్నే రాజారెడ్డి,అచ్యుతరావు,బాపురపు నర్సయ్య,పిప్పోజి మహేందర్ బాబు,మున్ను,సుధావేణి మురళి,మరిపెల్లి శ్రీనివాస్, కటుకం రాజేశం,సామల్ల వేణు,మోహన్ రెడ్డి, లింగన్న,ఆరె శీను,కృష్ణ, భూమేష్,దదీపక్,అనుమండ్ల చంద్ర తేజ,కాసవేని రాజేష్,జలపతి, పడిగెల నరసింహ,కొత్తపెల్లి అరవింద్, కటుకం సాయి తదితరులు పాల్గొన్నారు.

## లోకకళ్యాణంకై మూటపెల్లి లో శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామివారి

# సప్తతి తిరునక్షత్ర శ్రీరామ కలశ హృదయ యాత్ర...

### సర్పంచ్ సంగెం కీర్తనరమేష్, ఉపసర్పంచ్ బోడ రాజ్ కుమార్...



**రాయికల్ మండలం ఆగష్టు,20( రిపబ్లిక్ న్యూస్)** జగిత్యాల్ జిల్లా రాయికల్ మండలంలో మూటపెల్లిలో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి 70వ తిరునక్షత్ర శ్రీరామ హృదయ కలశ యాత్ర ఘనంగా జరిగింది. అర్చకులు రమణాచార్యులు, వికాస తరంగిణి బాధ్యులు వేల్పుల స్వామి యాదవ్, మర్యాద సత్యనారాయణ లు శ్రీరామ కలశం, చిన్నజీయర్ స్వామివారి చిత్రపటాన్ని సర్పంచ్ సంగెం కీర్తనరమేష్ కు, ఉపసర్పంచ్ బోడ రాజ్ కుమార్ లకు అందజేయడంతో "జై శ్రీరామ్" నినాదాలతో భక్తిశ్రద్ధలతో పాదయాత్ర కమ్యూనిటీ హాల్ నుండి శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయం వరకు నిర్వహించారు. కలశంలో శ్రీరామ అనుకుంటూ అక్షింతలు సమర్పించి తలపై ఎత్తుకుని అనుగ్రహం పొందారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ శ్రీరామ నామస్మరణతోనే దేశానికి, ధర్మానికి రక్షణ లభిస్తుందని, సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని, లోకకల్యాణం, దేశానికిధర్మానికి రక్షణ, ధర్మపాలకుల పరిరక్షణ, ధర్మస్థాపన జరగాలని శ్రీరాముడిని ప్రార్థించినట్లు తెలిపారు.



ఈ కార్యక్రమంలో సతీష్, సురేష్ దంపతులు, అజయ్,మోహన్ రెడ్డి, నారాయణ, భూమయ్య భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టరేట్ కార్యాలయంతో పాటు , అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో టి ఫైబర్ ఇంటర్నెట్ ఏర్పాటు డెడ్ లైన్ ఆగస్టు 31

**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 20** జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో టీ–ఫైబర్ సేవలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మెదక్ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల్లో టీ ఫైబర్ ఇంటర్నెట్ ఏర్పాటు చేయడంపై కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ) సంజయ్ జాజు ప్రత్యేక ఆదేశాలతో,ప్రైవేట్ ఇంటర్నెట్లను తొలగించి టి ఫైబర్ ఇంటర్నెట్ మారాలని సంబంధిత అధికారులతో సమీక్షించడం జరిగిందన్నారు టీ ఫైబర్ ఇంటర్నెట్



ఏర్పాటు చేయడం గురించి ప్రత్యేక నోడల్ ఆఫీసర్ నియమించి సమగ్ర ప్రణాళిక రూపొందించి త్వరలో కలెక్టరేట్లో అన్ని శాఖల తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయంలో ఇంటర్నెట్ అందుబాటుకు తీసుకువచ్చే విధంగా పగడ్బందీగా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు.

ఇంటర్నెట్ వినియోగం, వాటి సామర్థ్యం అన్ని ప్రభుత్వ కార్యాలయాలనుంచి సమగ్ర అంచనాల రూపొందించుకొని ఇంటర్నెట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 31 వరకు. టి ఫైబర్ ఇంటర్నెట్ ఏర్పాటు చేసే విధంగా అన్ని శాఖల ఉన్నతాధికారులు సహకరించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ ,ఈ.డీ.ఎం సందీప్, టి .ఫైబర్ ఇంటర్నెట్ మెదక్ జోనల్ మేనేజర్ ఈశ్వర్, టి .ఫైబర్ ఇంటర్నెట్ డీ.ఈ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## పి.వి. ప్రభాకర్ రావు 72వ జన్మదిన వేడుకలు ఘనంగా, చిరస్మరణీయంగా



**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 20** మాజీ ప్రధానమంత్రి, భారతరత్న శ్రీ పి.వి. నరసింహారావు గారి తనయుడు శ్రీ పి.వి. ప్రభాకర్ రావు గారి 72వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలు వేద పండితుల ఆశీర్వచనాలతో, పవిత్రమైన వేద మంత్రోచ్ఛారణలు మరియు సంప్రదాయ పూజా కార్యక్రమాలతో ప్రారంభమయ్యాయి. వేద పండితులు ఆయనకు వేదాశీర్వాదం అందిస్తూ, ఆయురారోగ్యం, సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం, సమృద్ధి, దీర్ఘాయుష్షు కలగాలని ప్రార్థించారు.

హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్ 3లోని ఆయన నివాసంలో జరిగిన ఈ శుభకార్యక్రమం ఆధ్యాత్మికతతో, ప్రశాంతమైన వాతావరణంతో ప్రారంభమై అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయ మిత్రులు, చిన్ననాటి స్నేహితులు, సహాధ్యాయులు, శ్రేయోభిలాషులు, తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీజేఎఫ్) సభ్యుల సమక్షంలో అత్యంత వైభవంగా కొనసాగింది.ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా ఆయన చిన్ననాటి స్నేహితులు, సహాధ్యాయులు తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. పాఠశాల రోజుల్లోని అనుభవాలను, చిన్ననాటి మధురస్మృతులను గుర్తుచేసుకుంటూ, శ్రీ పి.వి. ప్రభాకర్ రావు గారి సరళత, వినయం, స్నేహపూర్వక స్వభావం, మంచితనం, జీవితాంతం పాటిస్తున్న విలువలను వారు ఆత్మీయంగా వివరించారు.

ఆయన సోదరీమణులు, బావమరుదులు, ఇతర బంధువులు,కూడా ఆయన వ్యక్తిత్వం, కుటుంబ జీవితం గురించి ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. ముఖ్యంగా తన భార్య, పిల్లల పట్ల ఆయన చూపించే ప్రేమ, ఆప్యాయత, శ్రద్ధ, అండదండలను వారు ప్రత్యేకంగా ప్రశంసించారు.వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరి మాటల్లో పదేపదే వినిపించిన ఒక విశిష్టమైన లక్షణం శ్రీ పి.వి. ప్రభాకర్ రావు గారి మర్యాద, సరళత, ప్రశాంత స్వభావం, నిగర్వితనం, జీవితాన్ని ప్రశాంతంగా చూసే తీరు. భారతదేశంలో అత్యంత గౌరవనీయులైన ప్రధానమంత్రుల్లో ఒకరైన భారతరత్న శ్రీ పి.వి. నరసింహారావు గారి తనయుడిగా ఒక విశిష్ట కుటుంబ నేపథ్యం ఉన్నప్పటికీ, ఆయన ఎల్లప్పుడూ నిరాడంబరంగా, సామాన్యుడిలా, అందరితో ఆత్మీయంగా మెలుగుతూ తనదైన గౌరవప్రదమైన వ్యక్తిత్వాన్ని కొనసాగించారు.ఈ జన్మదిన వేడుకలను ఘనంగా, చిరస్మరణీయంగా నిర్వహించడంలో ఆయన కజిన్ బ్రదర్ శ్రీ పి.వి. శరత్ చేసిన కృషిని శ్రీ పి.వి. ప్రభాకర్ రావు గారు ప్రత్యేకంగా అభినందించారు. ఏర్పాట్లు ఎంతో చక్కగా జరిగాయని సంతృప్తి వ్యక్తం చేస్తూ, కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అంకితభావంతో పనిచేసిన సిబ్బంది, సమన్వయకర్తల కృషిని కూడా ప్రశంసించారు. ఆయన మేనల్లుళ్లు, కజిన్ బ్రదర్స్ కూడా ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీ వై జె ఎఫ్ ) అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్, డాక్టర్ జితేందర్ రావు తనుగుల కూడా టీ వై జె ఎఫ్ యూనియన్ సభ్యులతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొని శ్రీ పి.వి. ప్రభాకర్ రావు గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. డా. జితేందర్ రావు తనుగుల గారి హాజరు, టీ వై జె ఎఫ్ సభ్యుల భాగస్వామ్యం ఈ వేడుకలకు మరింత ఆత్మీయత, ప్రాధాన్యతను తీసుకువచ్చింది.

ఈ వేడుక కేవలం ఒక జన్మదిన వేడుకగా మాత్రమే కాకుండా, 72 సంవత్సరాల విలువైన జీవిత ప్రయాణానికి కుటుంబ విలువలు, స్నేహం, వినయం, గౌరవం, ఆత్మీయ సంబంధాలకు అద్దం పట్టిన ఒక అందమైన నివాళిగా నిలిచింది. చిన్ననాటి జ్ఞాపకాలు, కుటుంబ సభ్యుల ఆప్యాయత, మిత్రుల మధురస్మృతులు, నిర్వాహకులు మరియు సిబ్బందిపై ప్రశంసలు, బంధువులు, శ్రేయోభిలాషులు, సభ్యుల సమక్షం ఈ వేడుకను నిజంగా ప్రత్యేకమైనదిగా, చిరస్మరణీయమైనదిగా మార్చాయి.ఈ శుభ సందర్భంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, టీ వై జె ఎఫ్ సభ్యులు, శ్రేయోభిలాషులు శ్రీ పి.వి. ప్రభాకర్ రావు గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం, సమృద్ధి కలగాలని, తన కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, మిత్రుల మధ్య మరెన్నో ఆనందకరమైన సంవత్సరాలు గడపాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

# నోటీసుల పంపిణీ పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలి

**ఓటర్ల కు సౌలభ్యం కల్పించేందుకు పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్**






**నంద్యాల బ్యూరో, ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్):** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ సర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల పంపిణీ విచారణ,ఓటర్ల జాబితాకు సంబంధించి అభ్యంతరాలు, క్లెయిమ్ ల పరిష్కార ప్రక్రియ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ( సీఈవో) వివేక్ యాదవ్ గురువారం అన్ని జిల్లాల కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిగా జిల్లా నుంచి హాజరైన జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నోటీసుల పంపిణీ విచారణ క్లెయిమ్ లు మరియు అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఫారం 6,7,8 ద్వారా వచ్చిన క్లెయిమ్స్ అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. నోటీసుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తిగా పరిష్కరించాలన్నారు. ఎక్కువ పెండింగ్ ఉన్న నియోజకవర్గాలు పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నోటీసుల జనరేటర్ పంపిణీ ప్రక్రియను వెంటనే పూర్తి చేసి మ్యాపింగ్ కానీ ఓటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జూలై 1 వ తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తయిన యువతను ఓటర్లుగా నమోదు చేసేందుకు కళాశాలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. ఆగస్టు 22, 23, 29 మరియు 30 తేదీలలో (స్పెషల్ క్యాంపియన్ డేస్) ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించాలని తెలిపారు. డిఎల్ఓకాల్స్ కు బుక్ చేసుకున్న ఓటర్ల అభ్యంతరాలు నిర్ణీత సమయంలోపు స్పందించి పరిష్కరించాలన్నారు. ఎన్.జి.ఎస్.పి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. సర్ ప్రక్రియకు సంబంధించి సవరించిన షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.

**కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ**

జిల్లాలో సర్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి దశను గడువు లోపు పూర్తి చేస్తామని తెలిపారు.నోటీసుల పంపిణీ కి సంబంధించి శ్రీశైలం నియోజకవర్గంలో పెండింగ్ ఉందని గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు.ఫారం 6 సంబంధించి దరఖాస్తులు అధిక సంఖ్యలో వచ్చినప్పటికీ ప్రత్యేక క్యాంపులు నిర్వహించి సకాలంలో పరిష్కరిస్తామని తెలిపారు. బి ఎల్ వో ల కుసంబంధించిన 9 కాల్స్ పెండింగ్లో ఉండగా వాటిల్లో రెండు 48 గంటలు దాటాయనీ వాటిని కూడా త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఎం జి ఎస్ పిఫిర్యాదులు పెండింగ్లో లేవని తెలిపారు. 80283 నోటీసులు జనరేట్ చేయడం జరిగిందన్నారు. మిగిలిన నోటీసుల ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. శ్రీశైలం నియోజకవర్గం నోటీసుల పంపిణీ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ప్రక్రియ సజావుగా జరగాలని సిఈఓ సూచించగా అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డి ఆర్ ఓ రాము నాయక్, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మంత్లీ తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోడౌన్ లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా



**నంద్యాల బ్యూరో, ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24×7 నిరంతరం నిఘా, పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మార్గదర్శకాలు ఆదేశాల మేరకు మంత్లీ తనిఖీల్లో భాగంగా నంద్యాల జిల్లా మార్కెట్ యార్డ్ టెక్ గోడౌన్ నందు భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాలు, సీలింగ్, ఫైర్ సేఫ్టీ తదితరాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేసారు. అనంతరం ఈవీఎం గోడౌన్ రిజిస్టర్ నందు సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ రాము నాయక్, ఆర్ డి ఓ విశ్వనాథన్, ఎలక్షన్ డి టి మనోహర్, నంద్యాల తాసిల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీవై రెడ్డి ఆగ్రో ఇండస్ట్రీని సందర్శించిన జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా







**నంద్యాల బ్యూరో, ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్):**
ఎస్పీవై రెడ్డి ఆగ్రో ఇండస్ట్రీలో పరిశ్రమ కార్యకలాపాలు, ఉత్పత్తి ప్రక్రియ, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశాలను జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా గురువారం పరిశీలించారు. రెవెన్యూ, ఎక్సైజ్, పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీస్, లేబర్ తదితర శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్, పరిశ్రమలో పాటిస్తున్న భద్రతా ప్రమాణాలు, గ్రీనరీ, పరిశ్రమ నుంచి వెలువడే బై-ప్రొడక్ట్స్ నిర్వహణ, బై-ప్రొడక్ట్స్ ప్రాసెసింగ్ యూనిట్ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. పరిశ్రమ కార్యకలాపాల వల్ల పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాలుష్య నియంత్రణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమ నుంచి వెలువడే బై-ప్రొడక్ట్స్‌ను నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహిస్తూ, వాటి ప్రాసెసింగ్ మరియు వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పరిశ్రమ పరిసరాల్లో గ్రీనరీని మరింత పెంచాలని, పరిశుభ్రతను నిరంతరం నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# పోలో యాప్ ద్వారా పరిచయం చేసుకొని దోపిడీకి పాల్పడిన నలుగురు నిందితులు అరెస్ట్

**నిందితుల వద్దనుండి కత్తులు, ఇనుప రాడ్లు, మొబైల్ ఫోన్లు, నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం**

**నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ సుస్మిత**




**నంద్యాల క్రైం, ఆగస్టు 20, (రిపబ్లిక్ న్యూస్):**
యాప్‌లో పరిచయం..మాటలతో నమ్మకం..ఆపై ఒంటరి ప్రదేశానికి తీసుకెళ్లి కత్తులు,ఇనుప రాడ్లతో బెదిరించి దోపిడీ.నంద్యాలలో వెలుగుచూసిన ఈ వ్యవహారం కలకలం రేపుతోంది.'పోలో' యాప్ ద్వారా పరిచయం పెంచుకుని ఓ వ్యక్తిని నమ్మించి నంద్యాల-కొత్తపల్లి రహదారిలోని ఆంజనేయస్వామి ఆలయం వద్దకు తీసుకెళ్లి దోపిడీ చేసిన కేసులో నలుగురు యువకులను తాలూకా పోలీసులు అరెస్టు చేశారు.కేసు వివరాలను ఏఎస్పీ సుస్మిత ఐపీఎస్ మీడియా సమావేశంలో వెల్లడించారు.

**ఫంక్షన్' అంటూ పిలుపు.**

పోలీసుల వివరాల ప్రకారం..బాధితుడికి 'పోలో'యాప్ ద్వారా నిందితులతో పరిచయం ఏర్పడింది. నంద్యాల-కొత్తపల్లి రోడ్డులోని గోల్డెన్ ఫంక్షన్ హాల్ వద్ద కార్యక్రమం ఉందని,అక్కడ తమ స్నేహితులు ఉన్నారని నమ్మించారు.అనంతరం అతడిని ఆంజనేయస్వామి ఆలయం వద్దకు తీసుకెళ్లారు.

**ఒక్కసారిగా కత్తులు..రాడ్లు.**

ఆగస్టు 15 రాత్రి సుమారు 10.30గం"లకు ఆలయం వద్దకు చేరుకున్న తర్వాత అసలు కథ మొదలైంది.బాధితుడిని కత్తులతో బెదిరించి..ఇనుప రాడ్లతో దాడి చేసి,అతని వద్ద ఉన్న రూ.7,200 నగదు,సెల్‌ఫోన్‌ను లాక్కొని నిందితులు అక్కడి నుంచి పరారైనట్లు ఏఎస్పీ తెలిపారు.

**ఫిర్యాదుతో కదిలిన పోలీసులు.**

బాధితుడు ఆగస్టు 17న రాత్రి నంద్యాల తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి,దర్యాప్తు చేపట్టారు.సాంకేతిక ఆధారాలతో పాటు ఇతర మార్గాల్లో దర్యాప్తు చేసి,నిందితుల ఆచూకీ గుర్తించారు. ఆగస్టు 19న రాత్రి 9.10 గంటలకు నందమూరి నగర్ వద్ద బీఏ డబ్ల్యూ వెంచర్స్ సమీపంలో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్పీ వెల్లడించారు..అరెస్టయిన వారిలో బొల్లేద్దుల పవన్‌కుమార్ (21) సం",గుర్రం వెంకట నాగచరణ్ అలియాస్ చరణ్ (19) సం",పసుపులేటి వెంకట ఉమాకాంత్ (21) సం "బాల్‌శెట్టి హేమంత్ (19) సం" ఉన్నారు.నిందితుల నుంచి రెండు కత్తులు,రెండు ఇనుప రాడ్లు, బాధితుడి మొబైల్‌ఫోన్,నిందితుల మొబైల్‌ఫోన్లు, రూ.7,200 నగదు,హోండా మోటార్‌సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఇదే తరహాలో 'పోలో'యాప్ ద్వారా మరికొందరితో పరిచయాలు పెంచుకుని ఘటనలకు పాల్పడినట్లు నిందితులు విచారణలో చెప్పినట్లు ఏఎస్పీ సుస్మిత తెలిపారు.అయితే ఇప్పటివరకు ఆయా ఘటనలపై ఫిర్యాదులు అందలేదన్నారు.

ఇలాంటి ఘటనలకు గురైన బాధితులు ఎవరైనా ఉంటే పోలీసులను ఆశ్రయించాలని,ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని,ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ సుస్మిత ఐపీఎస్ స్పష్టం చేశారు.

**యాప్ పరిచయాలపై అప్రమత్తం.**

ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా పరిచయమైన అపరిచితులను



కలిసే విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ సుస్మిత సూచించారు.ముఖ్యంగా నిర్మానుష్య ప్రాంతాలకు రావాలని ఎవరైనా చెబితే జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు.

**పోలీసులకు ఎస్పీ అభినందనలు.**

జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఐపీఎస్ ఆదేశాలతో,ఏఎస్పీ సుస్మిత ఐపీఎస్ ఆధ్వర్యంలో తాలూకా సీఐ ఆర్.ఈశ్వరయ్య, ఎస్ఐ గంగయ్య వారి సిబ్బంది దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకున్నారు.కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ అభినందించారు.

# ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన డిఆర్ఓ రాము నాయక్






**నంద్యాల బ్యూరో, ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్):** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ సర్ ప్రక్రియలో భాగంగా భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జారీ చేసిన మార్గదర్శకాల అమలుపై గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులతో డి ఆర్ ఓ రాము నాయక్ సమావేశం నిర్వహించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు సమావేశం జరిగింది. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనగా, ఎన్నికల విభాగం అధికారులు సంబంధిత అంశాలను వివరించారు. డి ఆర్ ఓ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు జారీ చేసిన నోటీసుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న నోటీసుల పంపిణీ, విచారణలు, తుది ప్రచురణ తదితర అంశాలపై సమీక్షిస్తూ వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 80,283 నోటీసులు జనరేట్ చేయగా, ఇప్పటివరకు 70,615 నోటీసులు పంపిణీ చేసినట్లు వివరించారు. ఇంకా 9,668 నోటీసులు పంపిణీ చేయాల్సి ఉందని తెలిపారు. అలాగే 12,142 విచారణలు పూర్తయ్యాయని, 57,473 విచారణలు పెండింగ్‌లో ఉన్నాయని, 12,587 కేసులు తుది ప్రచురణ కోసం పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 లకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 30, 2026 వరకు అందిన క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను ఆగస్టు 22, 23, 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక ప్రచార దినాల్లో బూత్ స్థాయి అధికారులు ( బి ఎల్ ఓలు) సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పెండింగ్ ఫిర్యాదులు, 'బుక్ ఎ కాల్ విత్ బి ఎల్ వో' అంశాలపై కూడా సమావేశంలో సమీక్షించారు.

# శ్రీ గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్ నందు

# వైభవోపేతంగా వరలక్ష్మీ వ్రతం






**నంద్యాల ఆగస్టు 20 (రిపబ్లిక్ న్యూస్) :**
నంద్యాల జిల్లా బాబా నగర్ నందుగల శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో ముందస్తుగా వరలక్ష్మీ వ్రత ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లుగా స్కూల్ డైరెక్టర్ పి షేక్షావలి రెడ్డి గారు తెలిపారు వరలక్ష్మీ వ్రత వేడుకను పురస్కరించుకొని. స్కూల్ ప్రాంగణంలో లక్ష్మీదేవి అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, వేద పండితుల సమక్షంలో మంత్రోచ్చారణతో వ్రతాన్ని నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం యొక్క ఆవశ్యకతను తెలిపే కథల ద్వారా పిల్లలకు ఆధ్యాత్మిక చింతన భక్తితత్వం అలవర్చుకునే రీతిలో అమ్మవారి గొప్పతనాన్ని అద్భుతంగా వివరించారు. విద్యార్థులందరి చేత సంస్కృతి సంప్రదాయాలను బాల్య దశలోని అలవర్చుకోవాలని సంకల్పంతో అమ్మవారి చిత్రపటంతో పూలు అక్షింతలు కుంకుమార్చన తో సామూహిక వ్రతాన్ని నిర్వహించారు. లిఈ కార్యక్రమంలో కిండర్ గార్డెన్ చిన్నారుల అష్టలక్ష్మి దేవి ల వేషధారణ ఆకట్టుకున్నది అనంతరం పండితులు విద్యార్థులకు అమ్మవారి ప్రతిమను అందజేసి లక్ష్మీదేవి కృపాకటాక్షములను కలిగి ఉండాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ షేక్షావలి రెడ్డి గారు మాట్లాడుతూ నేటితో నేటితరం చిన్నారులకు మన భారతీయ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేయాలని సదుద్దేశంతో చిన్నారులకు వేద పండితుల సమక్షంలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని చిన్నారులతో చేయించడం ఆనందదాయకం. బాల్య దశలోనే ఆధ్యాత్మిక చింతన, దైవత్వం ఈ భావాలను పెంపొందించుకోవడానికి ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయని విద్యార్థులకు సూచించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com